రెండేళ్లలో స్టీల్ ఫ్యాక్టరీ నిర్మాణం

జిల్లాలో స్టీలు ఫ్యాక్టరీ నిర్మాణం సాగుతుంది. మహానాడులో చెప్పిన విధంగానే పనులు మొదలయ్యాయి. మొదటిదశ స్టీలు ఫ్యాక్టరీ నిర్మాణాన్ని 2028 డిసెంబరు నాటికి పూర్తి చేస్తాం.. అని సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. శుక్రవారం జమ్మలమడుగు చేరుకున్న ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. ఆటోలో ప్రయాణించి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. ప్రజావేదికలో బంగారు కుటుంబాలకు భరోసా కల్పించి మార్గదర్శులను అభినందించారు. కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. గండికోటను సందర్శించి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

- టూరిజం సర్క్యూట్‌గా గండికోట, ఒంటిమిట్ట, దేవునికడప
- కొప్పర్తి పారిశ్రామికవాడ అభివృద్ధి
- జిల్లాలో ప్రాజెక్టుల పూర్తికి చర్యలు
- సీఎం చంద్రబాబునాయుడు
- గూడెంచెరువులో పింఛన్ల పంపిణీ
- గండికోట అభివృద్ధికి శంకుస్థాపనలు

కడప/జమ్మలమడుగు/ఎర్రగుంట్ల/ప్రొద్దుటూరు/ముద్దనూరు/మైలవరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు శుక్రవారం జమ్మలమడుగులోని గూడెంచెరువులో పింఛన్ల పంపిణీ అనంతరం ప్రజావేదిక వద్ద ప్రజలతో మాట్లాడుతూ.. మహానాడులో త్వరలోనే కడపకు స్టీల్‌ప్లాంట్ వస్తుందని చెప్పామని మాట ప్రకారం స్టీల్‌ప్లాంట్‌ను శాంక్షన్ చేశామని అన్నారు. 2028 డిసెంబరు కల్లా ఫేజ్-1 పూర్తిచేయాలని జిందాల్ కంపెనీకి స్పష్టంగా ఆదేశించామని తెలిపారు. జిందాల్ సంస్థ కూడా మొదటి దశ రూ.4500 కోట్లు, రెండో దశ రూ.11,850 కోట్లతో ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తుందని తెలిపారు. గాలేరు-నగరి కాల్వలు కడప వరకు తీసుకెళతామని చెప్పామని, వచ్చే ఏడాది మొదటికల్లా కడప వరకు గాలేరు-నగరి కాల్వలు పూర్తి చేస్తామన్నారు.

అమెరికాలో గ్రాండ్ క్యానన్ ఉందని, గండికోట పెన్నాలోయ ఇండియాకే గ్రాండ్ క్యానన్ అని అన్నారు. ప్రపంచంలో అతి సుందరమైన ప్రదేశాల్లో గండికోట పదోది అన్నారు. దీనిని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దడానికి రూ.80 కోట్లతో పనులు కూడా ప్రారంభిస్తున్నామన్నారు. అక్కడే కృష్ణదేవరాయల విగ్రహం కూడా రాబోయే రోజుల్లో పెట్టిస్తామన్నారు. ఒక పక్క గండికోట, ఒంటిమిట్ట, మధ్యలో కడప దర్గా ఈ మూడు అనుసంధానం చేసి స్పిరిచువల్ హబ్‌గా మారుస్తామన్నారు. రాయలసీమ రాళ్లసీమ కాదు రతనాల సీమగా చేసి చూపిస్తున్నామన్నారు. 2024లో ఉమ్మడి కడప జిల్లాలో ఏడు సీట్లు ఇచ్చారని ఈసారి పదికి పదిసీట్లు ఇచ్చేందుకు మీరు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అందుకే మీ రుణం తీర్చుకుంటున్నానని చెప్పారు.. రాయలసీమలోని జీడీపల్లె, మారాల, చెర్లో పల్లె, అవుకు, గండికోట, బ్రహ్మసాగర్, మైలవరం ప్రాజెక్టులన్నీపూర్తి చేసింది టీడీపీ ప్రభుత్వమన్నారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తయారు చేయాలనే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. కొప్పర్తి, ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్కులలో రూ.5 వేల కోట్లు పెట్టి అభివృద్ధి చేస్తున్నామన్నారు.



పింఛన్లు అందజేసిన చంద్రబాబు

తొలుత చంద్రబాబునాయుడు గూడెం చెరువులోని ఉలసాల అలివేలమ్మ అనే మహిళ ఇంటికి వెళ్లి ఆమెకు వితంతు పింఛన్ అందించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులతో కాసేపు ముచ్చటించారు. వారి స్థితగతులు తెలుసుకున్నారు. ఆమె పెద్ద కుమారుడు వేణుగోపాల్‌కు చెందిన చేనేత మగ్గాన్ని సీఎం పరిశీలించారు. 1వ తరగతి చదువుతున్న ఆరేళ్ల కుమారుడు హర్షవర్ధన్‌కు తల్లికి వందనం వచ్చిందని వారు ధన్యవాదాలు తెలిపారు. అక్కడే చేనేతలతో చిట్‌చాట్ మాట్లాడారు. అలివేలమ్మ చిన్నకుమారుడు జగదీశ్ ఆటోలో ప్రజావేదిక వద్దకు చంద్రబాబు ప్రయాణించారు. చంద్రబాబు ఆటోలో రావడం చూసి అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. జమ్మలమడుగు మండలం అంబవరం పంచాయతీకి చెందిన బోయపాటి రామయ్య కూతురు బోయపాటి లక్ష్మీదేవి (30) పూర్తి అంగవైకల్యంతో బాధపడుతున్నారు. తనకు పింఛను రూ.4 వేలు నుంచి రూ.15 వేలకు పెంచాలంటూ సీఎంను కలిసి విన్నవించారు. ఈ మేరకు వారికి హామీ ఇచ్చారు. అనంతరం జమ్మలమడుగులో టీడీపీ కార్యకర్తల సమావేశంలో చంద్రబాబు పాల్గొన్నారు. తర్వాత గండికోటలో రూ.78 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. డిసెంబరు 26, 27 తేదీల్లో గండికోట ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. గండికోట అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ అమలు చేసినట్లు తెలిపారు.

క్యాటగిరీ వైజ్ విభజన : కలెక్టర్

బంగారు కుటుంబాలను క్యాటగిరీ వైజ్ విభజించి వారిని అదుకుంటున్నట్లు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. గూడెంచెరువులో మొత్తం 1,840 కుటుంబాలున్నాయన్నారు. ఆసుపత్రులు ఇతర వాటి కోసం ఎదురు చూసే వారు ఒక క్యాటగిరీ, బతుకుదెరువు ద్వారా ఆదాయాన్ని పెంచుకునేందుకు ఎదురుచూస్తున్న వారు రెండో క్యాటగిరీ, ఆర్థికపరమైన వెసులుబాటు ఉంటే పైచదువులకు వెళ్లేందుకు ఎదురు చూసే వారు మూడో క్యాటగిరీ, చదువు పూర్తి చేసుకుని స్కిల్ డెవలప్‌మెంట్ తీసుకుని స్వశక్తిగా ఎదిగేందుకు చూస్తున్న వారు నాలుగో క్యాటగిరీగా విభజించినట్లు తెలిపారు. ఎన్ఆర్ఐ మనోహర్‌రెడ్డి సుమారు 2 వేల మందికి ఉపాధి కల్పిస్తున్నారని, ప్రముఖ పారిశ్రామికవేత్త చెన్నారెడ్డి హైదరాబాదులో కొంతమందికి ఉపాధి కల్పిస్తున్నారన్నారు.

రెండు మున్సిపాలిటీలకు రూ.60 కోట్లు

జమ్మలమడుగు, ఎర్రగుంట్ల మున్సిపాలిటీలకు రూ.60 కోట్లు మంజూరు చేస్తున్నట్లు సీఎం చంద్రబాబునాయుడు తెలిపారు. చెరువులకు నీరు నింపేందుకు లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు చేశారు. అలాగే గండికోట మునక ప్రాంతాలకు బ్యాలెన్స్ నిధులు మంజూరు చేసేందుకు హామీ ఇచ్చారు.

భరోసా ఇచ్చే నాయకుడు భూపేశ్

కష్టకాలంలో ఎక్కడా వెనుతిరగకుండా పార్టీ కార్యకర్తలకు భరోసా ఇచ్చిన నాయకుడు భూపేశ్ అని సీఎం చంద్రబాబు ప్రశంసించారు. నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ నేనున్నానని గ్రామ గ్రామాన తిరిగి వైసీపీ నాయకుడికి దీటుగా పోరాడి టీడీపీని జమ్మలమడుగులో నిలబెట్టారన్నారు. గన్‌షాట్‌గా జమ్మలమడుగు టీడీపీదే అని.. ఎన్డీయే పొత్తు లేకుంటే భూపేశే ఎమ్మెల్యే అన్నారు. సమర్థవంతమైన భూపేశ్ నాయకత్వంలో పనిచేయండి పార్టీ అండగా ఉంటుందని చంద్రబాబు భరోసా ఇచ్చారు. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ చదిపిరాళ్ల నారాయణరెడ్డి పాల్గొన్నారు. నియోజకవర్గం పరిధిలోని మండలాల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



మహిళల ఉత్సాహం



జగన్ విలన్ కాదు.. డాన్ : ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

జగన్ విలన్ కాదని ఒక డాన్ అని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి విరుచుకుపడ్డారు. జమ్మలమడుగులో టిడ్కో ఇళ్లు ఆపిన జగన్ లాంటి వ్యక్తి మనకు రాజకీయాల్లో అవసరమా అంటూ ధ్వజమెత్తారు. బటన్ నొక్కి బట్టర్ తిన్నాడని విమర్శించాడు. లిక్కర్ స్కాంలో ఎక్కడ చూసినా డెన్‌లలో డబ్బులు కుప్పలు కుప్పలుగా దొరుకుతున్నాయన్నారు. సాక్ష్యం లేని సాక్షి పేపరును జమ్మలమడుగులో అందరూ ఖండించారన్నారు. గండికోటకు రావాల్సిన డబ్బును వెంటనే రిలీజ్ చేయాలని, రాజోలి నిర్మాణం జరగాలని, ఎస్ఆర్‌బీసీ పూర్తి చేయాలని, 40 చెరువులు నింపేందుకు లిఫ్ట్ కావాలని, గాలేరి-నగరి, టెక్స్‌టైల్స్ పార్కు పూర్తి చేయాలని సీఎంను కోరారు.

గండికోటలో గుర్రపుస్వారీ నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు నాయుడు





ఉలసాల అలివేలమ్మకు పెన్షన్ పంపిణీ చేస్తున్న సీఎం చంద్రబాబునాయుడు

సీఎం పర్యటన సాగిందిలా..

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుక్రవారం మధ్యాహ్నం 12.41 గంటలకు కడప విమానాశ్రయం చేరుకున్నారు. ఇక్కడ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 1.10గంటలకు జమ్మలమడుగు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు ప్రత్యేక హెలికాప్టర్‌లో చేరుకున్నారు. ఇక్కడ ఎమ్మెల్యేలు వరదరాజులరెడ్డి, పుత్తా చైతన్యరెడ్డి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, సీఎం సురేశ్‌నాయుడు తదితరులు స్వాగతం పలికారు. ఇక్కడ నుంచి హెలిక్యాప్టరులో బయల్దేరి 1.12గంటలకు జమ్మలమడుగులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. హెలిప్యాడ్ వద్ద జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్.సవిత, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేశ్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ తదితరులు స్వాగతం పలికారు. 1.50గంటలకు అక్కడ నుంచి రోడ్డుమార్గాన బయల్దేరారు. 2.05గంటలకు గూడెంచెరువులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో పాల్గొని, చేనత కుటుంబం వేణుగోపాల్ ఇంటికి వెళ్లి ముఖాముఖిమాట్లాడారు. 2.30గంలటకు బయల్దేరి 2.50కి ప్రజావేదిక వద్దకు చేరుకున్నారు. 4.05కు అక్కడ నుంచి బయల్దేరి 4.12కు జమ్మలమడుగులో నానాబాల యల్లప్ప ఫంక్షను హాలులో టీడీపీ కార్యకర్తల సమావేశానికి హాజరయ్యారు. అనంతరం 5.20గటలకు గండికోటకు చేరుకున్నారు. గండికోటలో వ్యూ పాయింట్ పరిశీలించి స్టేక్‌హోల్డర్స్ ప్రాజెక్టు డెవలపర్స్‌తో సమావేశంలో. 6.20గంటలకు హెలికాప్టర్‌లో గండికోట నుంచి బయల్దేరి 6.50గంటలకు కడప విమానాశ్రయానికి వచ్చారు. ఇక్కడి నుంచి 6.55కు ప్రత్యేక విమానంలో సీఎం గన్నవరం బయల్దేరారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి తదితరులు చంద్రబాబుకు వీడ్కోలు పలికారు.



గండికోటలోఅభివృద్ధి పనులకు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి కందుల దుర్గేశ్.. చిత్రంలో ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్, కృష్ణచైతన్యరెడ్డి, అఖిలప్రియ, ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి











ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు వరదరాజులరెడ్డి, పుత్తా కృష్ణచైతన్య రెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, హరిప్రసాద్





పుష్పగుచ్ఛం అందిస్తున్న పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీఎం సురేశ్‌నాయుడు



చంద్రబాబుకు చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, భూపేశ్‌రెడ్డి తదితరులు



పుష్పగుచ్ఛం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితేష్‌కుమార్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి



సభకు హాజరైన ప్రజలు



93 శాతం పింఛన్లు పంపిణీ

కడప, ఎన్టీఆర్ సర్కిల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో 93 శాతం ప్రగతిని సాధించినట్లు డీఆర్‌డీఏ ఏపీడీ వీణా వెంకటేశ్వరప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2,57,657 పెన్షన్ల పంపిణీకి రూ.111.71 కోట్లు నిధులు విడుదల కాగా 2,38,814 మందికి రూ. 103,06,47,000 పంపిణీ చేసినట్లు వివరించారు. పులివెందుల మున్సిపాలిటీ ప్రథమ స్థానంలో, జమ్మలమడుగు మండలం చివరి స్థానంలో నిలిచాయి.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు



కడప మారుతీనగర్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచలానికి ఈనెల 9న పౌర్ణమి సందర్భంగా ఆర్టీసీ కడప రీజియన్ పరిధిలోని కడప, బద్వేలు, మైదుకూరు, ప్రొద్దుటూరు, పులివెందుల, జమ్మలమడుగు డిపోల నుంచి అరుణాచలానికి ఈనెల 8న ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ ఆర్ఎం పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. కడప డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సు సాయంత్రం 4.30 గంటలకు, బద్వేలు డిపో నుంచి అల్ట్రా డీలక్స్ ఉదయం 9 గంటలకు, మైదుకూరు డిపో నుంచి సూపర్‌లగ్జరీ బస్సు 8వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు, ప్రొద్దుటూరు డిపో నుంచి సాయంత్రం 6 గంటలకు బస్సు బయలుదేరుతుందన్నారు. జమ్మలమడుగు డిపో నుంచి సాయంత్రం 5 గంటలకు, పులివెందుల డిపో నుంచి ఉదయం 7 గంటలకు బయలుదేరుతుందని తెలిపారు. జిల్లాలోని భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానం చేరుకోవాలని కోరారు.

పులివెందుల జడ్పీటీసీని గెలవాల్సిందే

- బీటెక్ రవి, రాంగోపాల్‌కు చంద్రబాబు ఆదేశం



కడప, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీని గెలుచుకునే బాధ్యత మీ ఇద్దరిదే అంటూ సీఎం చంద్రబాబునాయుడు ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవిలకు తెలిపారు. జిల్లా పర్యటన అనంతరం విజయవాడ వెళుతున్న సందర్భంగా ఎయిర్‌పోర్టులో టీడీపీ నేతలు చంద్రబాబుకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికపై వారిద్దరితో పాటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డితో మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు జనంలోకి తీసుకెళ్లి ఎట్టి పరిస్థితుల్లో జడ్పీటీసీ స్థానం గెలివాలని వారికి తేల్చి చెప్పారు. జడ్పీటీసీ స్థానానికి బీటెక్ రవి సతీమణి లత నామినేషన్ దాఖలు చేశారు.

రైతులకు తీపి కబురు

- రూ.133 కోట్లు ఖాతాల్లోకి
- 1,94,047 మంది రైతులకు ప్రయోజనం
- నేడు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ప్రారంభం

కడప రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి) ప్రభుత్వం రైతులకు తీపి కబురు చెప్పింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.97కోట్లు, పీఎం కిసాన్ ద్వారా రూ.36 కోట్లు మొత్తం రూ.133 కోట్లను మంజూరు చేసింది. ఈ నిధుల ద్వారా లక్షా 94 వేల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. శనివారం జిల్లాలో ఇన్‌చార్జ్ మంత్రి సవిత, ఆయా నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు, నాయకులు అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించనున్నారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ కానుంది.

తంబళ్లపల్లెలో ఖర్జూర సిరులు



- మూడు ఎకరాల్లో ప్రయోగాత్మకంగా ఎడారి పంట
- సాగుకు ఇక్కడి వాతావరణ పరిస్థితులు అనుకూలం
- ఈ ఏడాది ఆశాజనకంగా పంట దిగుబడి
- మార్కెటింగ్ సౌకర్యం లేక ఇబ్బందులు

తంబళ్లపల్లె, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఎడారి దేశాలతో పాటు మన దేశంలోని రాజస్థాన్ వంటి ఉష్ణ మండల ప్రాంతాల్లో మాత్రమే పండే ఖర్జూర పంటను కరువుకు పేరుగాంచిన తంబళ్లపల్లెలో సాగు చేస్తూ ఖర్జూర సిరులు కురిపిస్తున్నారు ఇద్దరు రైతు అన్నదమ్ములు. ఖర్జూర సాగుకు ఇక్కడి నేల అనుకూలించడంతో మంచి దిగుబడిని సాధిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఒక్కో మొక్క రూ.4500తో కొనుగోలు

ఖర్జూర సాగుకు మొదట్లో పెట్టుబడి ఖర్చు ఎక్కువగానే ఉంటుందని తంబళ్లపల్లె మండలం పరుసతోపు పంచాయతీ దబ్బలగుట్టపల్లెకు చెందిన రైతు అన్నదమ్ములు ఆర్.వెంకటరెడ్డి, పాపిరెడ్డిలు చెబుతున్నారు. రైతు కుమారులు ఆన్‌లైన్‌లో నిశితంగా శోధించి తక్కువ నీటితో ఇక్కడి నేల, వాతావరణంలో పెరిగి ఎక్కువ కాలం పాటు దిగుబడి వచ్చే ఖర్జూర సాగును ఎంపిక చేసుకున్నారు. 2020 నవంబరులో రాజస్థాన్ రాష్ట్రంలోని జయపూర్‌లో అతుల్ కంపెనీ నుంచి మేలు రకాలైన బర్హీ జాతికి చెందిన ఖర్జూర మొక్కలను తెప్పించి ప్రయోగాత్మకంగా సాగు చేపట్టారు. ఒక్కో మొక్కను నర్సరీలో రూ.4500తో కొనుగోలు చేయగా రవాణా చార్జీలు, భూమిలో నాటే కూలీల ఖర్చు కలిపి రూ.5 వేలు వరకు వచ్చినట్లు రైతులు చెబుతున్నారు. మొక్కకు మొక్కకు మధ్య ఎటుచూసినా 22 అడుగులు దూరం ఉండేలా 3 అడుగుల వెడల్పు, లోతు ఉండేటట్లు గొయ్యి తీసి నాటించారు. మూడు ఎకరాలకు కలిపి 210 (ఎకరాకు 70 మొక్కలు చొప్పున) మొక్కలను నాటారు. ఎకరాకు 70 నుంచి 80 మొక్కలు నాటుకోవచ్చు. ఇందులో ఒక్కో తోట చుట్టూ అక్కడక్కడా ఆడ చెట్లకు క్రాసింగ్ కోసం 8 మగ ఖర్జూర మొక్కలను నాటారు. ఇలా ఇద్దరు రైతులు కలిపి మూడు ఎకరాల్లో (ఒక్కొక్కరు ఒక టిన్నర ఎకరంలో) పంట సాగు చేసి మొక్కలను నాలుగు సంవత్సరాల పాటు జాగ్రత్తగా సంరక్షించారు. సాగుకు ఇక్కడి ప్రాంతం అనుకూలించడంతో గత ఏడాది జూలైలో మొదటిసారి పంట తీయగా..ఈ ఏడాది రెండోసారి పంట దిగుబడి ప్రారంభమైంది. జూలై, ఆగస్టు నెలల్లో మాత్రమే పంట దిగుబడి వస్తుందని, చెట్లను జాగ్రత్తగా కాపాడుకుంటే దాదాపు 60 ఏళ్లకు పైగా దిగుబడి పొందవచ్చని రైతులు చెబుతున్నారు.

మూడున్నర నుంచి నాలుగేళ్లకు దిగుబడి

ఖర్జూర మొక్కలు నాటిన మూడున్నర నుంచి నాలుగు సంవత్సరాల లోపు కాపుకు వస్తాయి. చెట్లకు ఫిబ్రవరి నుంచి మార్చి మొదటి వారంలో పూత రావడం ప్రారంభమవుతుంది. తోట చుట్టూ పరాగసం పర్కం కోసం కొన్ని మగ చెట్లను పెంచాల్సి ఉంటుంది. ఈ మగ చెట్లు కేవలం పూత మాత్రమే పూస్తాయి. ఆ పూతను ఎండబెట్టి ఆ పుప్పొడిని ఆడ చెట్లకు వచ్చిన పూతతో పరపరాగ సంపర్కం (క్రాసింగ్) చేస్తారు. ఒకవేళ మగ చెట్లు లేకుంటే ఈ పుప్పొడి రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాలలో కూడా దొరుకుతుంది. తోటలో చెట్టుకు ఉన్న ప్రతి గెలకు జాగ్రత్తగా క్రాసింగ్ చేపట్టాలి. ఈ ప్రక్రియ పూర్తయ్యాక ఆడ చెట్లకు పూసిన పూత ఫలదీకరణం చెంది పిందెలు అయ్యి గెలలుగా తయారవుతాయి. కాయలు ఆకుపచ్చ రంగులోంచి పూర్తిగా పసుపు, నారింజ రంగులోకి వచ్చినపుడు మాత్రమే కోసుకోవాలి. ప్రస్తుతం తోటలో ఉన్న ఒక్కో చెట్టుకు సరాసరి 4 నుంచి 8 గెలల వరకు వచ్చాయి. ఒక్కో గెల సుమారు 8 నుంచి 15 కిలోలకు పైగా వరకు బరువు ఉంటుంది. రెండో పంట కావడంతో ఒక్కో చెట్టుకు సుమారు 60 నుంచి 100 కిలోలకు పైగా దిగుబడి వస్తుందని మొత్తం మూడు ఎకరాల్లో కలిపి సుమారు 6 నుంచి 7 టన్నులకు పైగా దిగుబడి రావచ్చునని అంచనా వేస్తున్నారు.

కాండం తొలుచు పురుగు సమస్య

ఖర్జూరపు చెట్లకు కాండం తొలుచు పురుగు సమస్య ఎక్కువగా ఉంటుంది. చెట్లకు కింద ఉన్న చెత్త ద్వారా కాండం భాగంలో పురుగు ఆశించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఆ పురుగులు కంటికి కనిపించవు. పురుగులు కాండం భాగంలో చెట్టుకు రంధ్రం చేసుకుని లోపలి వరకు పొడిచి తింటాయి. పురుగులు పట్టకుండా ఉద్యాన అధికారుల సూచనల మేరకు కీటక నాశనులను చెట్టు పైభాగం నుంచి మొదలు వరకు పూర్తిగా తడిచేలా స్ప్రే చేయాలి. డ్రిప్‌లో కూడా కీటక నాశనులను మొక్కకు అందించాల్సి ఉంటుంది. అంతేకాకుండా కాయలు పక్వానికి వచ్చే సమయంలో పక్షులు, ఉడతల బారి నుంచి పంటను కాపాడుకోవాలి. దీని కోసం కాయలు పైకి కనిపించకుండా గెలలకు తెల్లటి ప్లాస్టిక్ కవరును కట్టుకోవాలి. చెట్టు ఒక్కసారి నాటుకుని కాపాడితే 60 ఏళ్లకు పైగా ఏడాదికి ఒకసారి దిగుబడి పొందవచ్చు.

నీటి అవసరం తక్కువ

ఖర్జూర చెట్లు సాధారణంగా ఉష్ణ మండల ప్రాంతాల్లో పెరుగుతాయి కాబట్టి పంటకు నీరు అవసరం అంత ఎక్కువగా ఉండదు. మొక్క సైజును బట్టి నీరు అందించాల్సి ఉంటుంది. వర్షాకాలంలో అయితే నీటి అవసరం పెద్దగా ఉండదు. వేసవి కాలంలో అవసరాన్ని బట్టి మూడు నుంచి నాలుగైదు రోజులకు ఒకసారి తడులు ఇవ్వాల్సి ఉంటుంది. చెట్ల మొదళ్లలో మేక, గొర్రెలు, పశువుల పేడను ఎరువులుగా అందిస్తే మొక్క బాగా ఏపుగా పెరుగుతుంది.

మార్కెటింగ్ సౌకర్యం లేదు



ఖర్జూర సాగుకు మన ప్రాంతం అనుకూలంగానే ఉన్నా గత ఏడాది మార్కెటింగ్ సమస్యతో చాలా ఇబ్బంది పడ్డాం. ఈ చుట్టు పక్కల ప్రాంతాల్లో నాకు తెలిసి ఇటువంటి పంట లేదు. గత ఏడాది వచ్చిన పంటను స్థానికంగా కొంత, బెంగళూరు, తిరుపతి, మదనపల్లె వంటి పట్టణాలకు తీసుకువెళ్లి మరికొంత విక్రయించాం. మంచి ఆదాయమే అయినా రవాణా ఖర్చులు, మార్కెట్‌లో దళారీల సమస్య వంటి కారణాలతో చాలా ఇబ్బంది పడ్డాం. పంటకు మొదట్లో పెట్టుబడి ఎక్కువగా పెట్టాల్సి వస్తుంది కాబట్టి సామాన్య, మధ్య తరగతి రైతులు ఇటువంటి పంటను సాగు చేయాలంటే కొంచెం ఆలోచించాలి.

- వెంకటరెడ్డి, ఖర్జూర రైతు, దబ్బలగుట్టపల్లె

మార్కెటింగ్ సౌకర్యం లేక ఇబ్బందులు

మంచి పోషక విలువలు కలిగిన ఖర్జూర కాయలకు మన ప్రాంతంలో మార్కెటింగ్ సౌకర్యం సరిగ్గా లేకపోవడంతో గత ఏడాది పంటను విక్రయించుకోవడానికి కొంత ఇబ్బందులు పడినట్లు రైతులు చెబుతున్నారు. ముఖ్యంగా గత ఏడాది గుజరాత్ నుంచి కాయలు ఎక్కువగా రావడంతో ఇక్కడ పండిన కాయలకు డిమాండ్ తగ్గడంతో పాటు ధర కూడా తక్కువగా పలికిందని చెబుతున్నారు. గుజరాత్ కాయలతో పోలిస్తే ఇక్కడి ప్రాంతంలో పండిన కాయలు తియ్యదనం ఎక్కువగా ఉండటంతో పాటు చెట్టు నుంచి కోసిన పదిహేను, ఇరవై రోజుల వరకు తాజాగా ఉంటాయని చెప్పారు. గత ఏడాది తిరుపతి, బెంగళూరు, మదనపల్లె మార్కెట్లలో కిలో రూ.180 నుంచి రూ.250 వరకు విక్రయించినట్లు తెలిపారు. రైతుల కుమారులు ఉద్యోగ రీత్యా బెంగళూరు నగరంలో ఉండటంతో వీఆర్ ఫార్మ్స్. ఫ్రెష్ బర్హీ డేట్స్ పేరుతో ఆన్‌లైన్‌లో కిలో రూ.150 నుంచి 200లతో విక్రయించినట్లు తెలిపారు. ఈ ఏడాది తొలి కోతను వారం రోజుల క్రితం బెంగళూరులోని ఓ కంపెనీకి కిలో రూ.180లతో 200 కేజీలు విక్రయించినట్లు రైతులు తెలిపారు. ఇటువంటి పంటలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే మరిన్ని నూతన పంటలను సాగు చేయడానికి రైతులు ఆసక్తి చూపుతారని రైతులు చెబుతున్నారు.



తంబళ్లపల్లెలోని ఖర్జూర తోట



కాయలకు తొడిగిన కవర్లు

స్వాతంత్ర్య దినోత్సవ పెరేడ్‌కు ఎంపిక



మనోజ్ కుమార్ | కుషాల్ కుమార్ | కే. చందు | శశికుమార్ రెడ్డి | ఎం. రాజేంద్ర

పీలేరు రూరల్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఆగస్టు 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ పెరేడ్‌కు స్థానిక సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఐదుగురు ఎన్‌సీసీ కేడెట్లు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన పీలేరులో విలేకరులతో మాట్లాడుతూ ఐదుగురు విద్యార్థులు ఎంపిక కావడం కళాశాల గౌరవాన్ని పెంచిందన్నారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ వెంకటరమణయ్య మాట్లాడుతూ 29 ఆంధ్ర బెటాలియన్‌లో సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అత్యుత్తమంగా నిలవడానికి కేడెట్లు సాధించిన విజయాలే కారణమని తెలిపారు. ఒకే కళాశాలకు చెందిన ఐదుగురు కేడెట్లు స్వాతంత్ర్య వేడుకల పెరేడ్‌కు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. వీరి ఎంపిక ఇతర కేడెట్లకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని తెలిపారు.

బొప్పాయి లారీ ప్రమాద బాధితులకు పరిహారం పంపిణీ



బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్, ముక్కా రూపానందరెడ్డి

రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): బొప్పాయి లారీ బోల్తా పడిన ఘటనలో అసువులు బాసిన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం ప్రకటించింది. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన శెట్టిగుంట ఎస్టీ కాలనీకి చెందిన దుర్గయ్య, గంగమ్మ, చెంచమ్మ, సుబ్బరత్న కుటుంబాలకు ఒక్కొకరికి రూ.3 లక్షల చొప్పున పరిహారం అందించింది. ఈ మేరకు కలెక్టర్ చామకూరి శ్రీధర్ శుక్రవారం బాధిత కుటుంబాలకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి మాట్లాడుతూ ఘటన జరిగిన వెంటనే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి బాధితులకు న్యాయం చేయాలని కోరానన్నారు. ప్రమాదం జరిగిన నాడు బాధితుల కుటుంబాలకు ముక్కా ఫౌండేషన్ ద్వారా రూ.50 వేలు ప్రకటించినట్లు తెలిపారు. ప్రభుత్వం అందించిన పరిహారంతో పాటు రూ.50 వేల చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేశారు. తహసీల్దార్ అమర్‌నాథ్, శెట్టిగుంట సీనియర్ నాయకులు నీలకంఠయ్య, చంద్ర, మైనారిటీ నాయకులు పఠాన్ మౌలా, బత్తిన వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు వెలిగల్లు కుడి కాలువకు నీరు విడుదల

గాలివీడు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): వెలిగల్లు ప్రాజెక్టు నుంచి కుడి కాలువకు ఈ నెల 3న ఆదివారం నీటిని విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు డీఈ భాస్కర్‌బాబు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 9 గంటలకు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. గత కొంతకాలంగా ఖరీఫ్ సీజన్‌లో వివిధ రకాల పంటల సాగుకోసం ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయాలని రైతులు విజ్ఞప్తి చేశారని, ఆ మేరకు నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

కడప రూరల్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కడప జిల్లాలోని పులివెందుల , ఒంటిమిట్ట జడ్పీ స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం నాటికి ముగిసింది. జూలై 30 నుంచి ఆగస్టు 1 వరకు మూడు రోజుల పాటు నామినేషన్లను దాఖలు చేశారు. టీడీపీ, జనసేన, వైఎస్ఆర్‌సీపీ, కాంగ్రెస్ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా నువ్వా నేనా అంటూ పెద్ద ఎత్తున నామినేషన్లను వేశారు. రెండు స్థానాలకు మొదటి రోజు 5, రెండవ రోజు 8, మూడవ రోజు 32 ఇలా మొత్తం 45 నామినేషన్లు వచ్చాయి. ఇందులో పులివెందుల జడ్పీటీసీకి 19. ఒంటిమిట్ట జడ్పీటీసీకి 26 దాఖలయ్యాయి. నామినేషన్ల పత్రాలను నేడు ఆగస్టు 2న ఉదయం 8 గంటల నుండి పరిశీలన చేయనున్నారు. కాగా పులివెందుల జడ్పీటీసీ టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్సీ బి.టెక్ రవి సతీమణి లతాదేవి శుక్రవారం టీడీపీ జిల్లా అధ్యక్షులు ఆర్. శ్రీనివాసులరెడ్డి(వాసు), ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిల సమక్షంలో నామినేషన్ దాఖలు చేశారు.

పోలీసు భవనానికే దిక్కు లేదు..
పర్యాటకుల రక్షణ ఎలా?

- మందుబాబులకు అడ్డాగా హెల్ప్‌డెస్క్ భవనం



హార్సిలీ హిల్స్‌పై పర్యాటకుల రక్షణార్థం నిర్మించిన హెల్ప్‌డెస్క్ భవనం

బి.కొత్తకోట, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పర్యాటకుల రక్షణ లక్ష్యంగా హార్సిలీహిల్స్‌లో ఏర్పాటైన పోలీస్‌హెల్ప్ డెస్క్‌కు మకిలి పట్టింది. రాష్ట్రంలోని నాలుగు ప్రముఖ పర్యాటక కేంద్రాలలో పోలీస్ అవుట్‌పోస్టులను అప్పటి ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ అవుట్‌పోస్ట్‌లో తగినంత మంది సిబ్బంది ఎల్లవేళలా శాంతిభద్రతలను పర్యవేక్షించాల్సి వుంది. అది ఎలాగూ అమలు కాలేదు. కాగా , హిల్స్‌పై పర్యాటకులు ఎక్కువగా సంచరించే, రాత్రిళ్లు పార్టీలకు నిలయమైన గాలిబండ వద్ద పోలీస్ హెల్ప్‌డెస్క్ పేరుతో ఓ సుందర భవనాన్ని నిర్మించారు. 2023 నవంబరు 23న అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు, కలెక్టర్ గిరీశ ప్రారంభించారు. ఓ కానిస్టేబుల్‌ను ఇక్కడ నియమించి పర్యాటకులకు రక్షణ కల్పించాలని నిర్ణయించారు. కొంతకాలం ఈ విధానం అమలైంది. దీంతో గాలిబండ ప్రాంతంలో ప్రశాంతత నెలకొంది. కొంతకాలంగా ఈ హెల్ప్‌డెస్క్‌ను పట్టించుకోకపోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. మందుబాబుల చిందులు అధికమయ్యాయి. హెల్ప్‌డెస్క్ భవనాన్నే వేదికగా చేసుకొని మద్యం తాగుతున్నారు. తలుపు బద్దలుకొట్టి లోపల చలిమంటలు సైతం వేసుకునే దుస్థితిక వచ్చారు. దీంతో చీకటి పడితే మహిళలు, పిల్లలతో కలిసి గాలిబండవైపు రావడానికే పర్యాటకులు భయపడే స్థితి నెలకొంది. కొండపై పోలీస్ నిఘా లేకపోవడంతో రాత్రిళ్లు బసచేసిన వారు బిక్కుబిక్కు మంటూ గడపాల్సివస్తోందని వాపోతున్నారు. పర్యాటకుల రక్షణ సంగతి అటుంచి ఆ భవనానికైనా రక్షణ కల్పించాలని పలువురు కోరుతున్నారు.



హెల్ప్‌డెస్క్ భవనంలో ఖాళీ మద్యం సీసాలు

ఆలయంలో హుండీ చోరీ





చోరీ జరిగిన ఆలయం, రోడ్డుపై పడేసిన హుండీ

పీలేరు రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ముడుపుల వేములవారిపల్లె సమీపంలోని ప్రసన్న అంజనేయస్వామి ఆలయంలో హుండీ చోరీ జరిగింది. గురువారం రాత్రి ఆలయ ప్రధాన అర్చకుడు కుమార్‌స్వామి ఆలయానికి తాళం వేసుకుని వెళ్లారు. శుక్రవారం తెల్లవారుజామున ఆలయానికి వెళ్లిన ఆయన గేట్లు తెరచి ఉండడం చూసి హుండీ చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, దొంగలు హుండీలోని సొమ్ము తీసుకుని పీలేరు - కడప జాతీయ రహదారిలోని యల్లమంద క్రాస్ వద్ద డివైడర్‌పై హుండీని వదిలి వెళ్లారు.

వివాహిత ఆత్మహత్యా యత్నం

బి.కొత్తకోట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల కారణంగా ఓ వివాహిత ఆత్మహత్యకు యత్నించిందని పోలీసులు తెలిపారు. మొటుకు పంచాయతీ పరిధిలోని పులుసుమానిపెంటకు చెందిన శివశంకర రోజూ మద్యం తాగి వస్తున్నాడని ఆయన భార్య లక్ష్మీదేవి గొడవ చేసేది. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి ఇద్దరూ గొడవ పడ్డారు. దీంతో మనస్తాపం చెందిన లక్ష్మీదేవి శుక్రవారం ఉదయం క్రిమిసంహారక మందు తాగింది. కుటుంబీకులు ఆమెను మదనపల్లె ఏరియా ఆస్పత్రికి తరలించగా, అక్కడి వైద్యులు తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ల చోరీ కేసులో ఒకరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కృష్ణమోహన్

చిన్నమండెం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాల చోరీ కేసులో షేక్. సద్దాం అనే యువకుడిని అరెస్టు చేసినట్లు రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ తెలిపారు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. గురువారం సాయంత్రం తూర్పుపల్లి క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న చిన్నమండెం ఎస్ఐ సుధాకర్ రాయచోటిలోని ఏజీ గార్డెన్, ప్రాంతానికి చెందిన మెకానిక్ షేక్. సద్దాంను అనుమానంతో అదుపులోకి తీసుకున్నాడు. రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, ఎస్ఐ సుధాకర్ ఆధ్వర్యంలో విచారణ చేయగా అతను ప్రయాణిస్తున్న వాహనంతో పాటు మరో ఐదు మోటార్ సైకిళ్లను చోరీ చేసినట్లు అంగీకరించాడని తెలిపారు. ఏఎస్ఐ అంజిరెడ్డి, కానిస్టేబుల్ పెంచలయ్య, మస్తాన్, ఇతర సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

అప్పులబాధ తాళలేక అరటి వ్యాపారి ఆత్మహత్య

పులివెందుల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక అరటి కాయల వ్యాపారి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. యర్రబల్లె తాండాకు చెందిన బుక్కే అంజనేయులునాయక్ (42) కొన్నేళ్లుగా రైతుల వద్ద అరటి పంటకొని ఢిల్లీ, హర్యానా తదితర రాష్ట్రాల్లో విక్రయించేవాడు. ఆ వ్యాపారులు కొన్ని రోజులుగా డబ్బు చెల్లించకపోవడంతో ఆయన రైతులకు డబ్బు చెల్లించలేకపోయాడు. రోజురోజుకు ఒత్తిడి పెరగడంతో అప్పుల బాధ తాళలేక గురువారం మధ్యాహ్నం 2.35 గంటల ప్రాంతంలో పురుగులమందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు.

కలెక్టర్, ముక్కా చొరవతో కొలిక్కి వచ్చిన బొప్పాయి ధరలు

- టన్ను ధర రూ.9వేలుగా నిర్ణయం
- 5వ తేదీ నుంచి టన్ను రూ. 10 వేలు
- ఢిల్లీలో వర్షాలు తగ్గితే ధర పెరిగే అవకాశం

రైల్వేకోడూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): బొప్పాయి ధరల పతనంతో రైల్వేకోడూరులో గురువారం బొప్పాయి రైతులు ఆందోళన చేసిన విషయం విదితమే. కలెక్టర్ చామకూరి శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సహకారంతో శుక్రవారం రైల్వేకోడూరు మండలంలోని ఉద్యాన కళాశాల ఆడిటోరియంలో దళారులు, రైతులు, మార్వాడీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ముద్దలూరు సుబ్బరామరాజు, పందేటి శివకుమార్‌రాజు మాట్లాడుతూ దళారులతో మోసపోతున్నామన్నారు. పీలేరు, కలికిరి, మదనపల్లె, అనంతపురం, ప్రకాశం తదితర ప్రాంతాల్లో బొప్పాయి టన్ను రూ.16 నుంచి 15 వేలు ఉండగా రైల్వేకోడూరులో ఎందుకు ఇంతగా ధరలు తగ్గించారన్నారు. రైల్వేకోడూరులో మొదట టన్ను రూ.16 ఉండగా రానురాను టన్ను రూ.7 వేలకు తగ్గించారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఢిల్లీ, రాజస్థాన్ మార్వాడీలతో కలెక్టర్ శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, ఉద్యాన, మార్కెటింగ్ శాఖలకు చెందిన అధికారులు, దళారులు, రైతులతో కలిసి మూడున్నర గంటల పాటు చర్చలు జరిపారు. ముందుగా మార్వాడీలతో సపరేటుగా చర్చలు జరిపారు. టన్నుకు రూ.9 వేలకు తగ్గకుండా ఈ నెల 4వ తేదీ వరకు ఉంటుందని, 5వ తేది నుంచి రూ.10 వేలు ఉంటుందని కలెక్టర్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజన్ అయినంత వరకు టన్ను రూ.9 వేలు ఉంటుందన్నారు. ఢిల్లీ, తదితర నగరాల్లో వర్షాల కారణంగా మార్వాడీలు బొప్పాయి ధరలను తగ్గించారన్నారు. మార్వాడీల సమస్యలు, దళారుల బాధలు కూడా తెలుసుకున్నామన్నారు. రోజుకు 200 లారీల్లో కాయలు వెళ్లే విధంగా వ్యాపారులు చర్యలు తీసుకుంటున్నామన్నారన్నారు. బొప్పాయి లారీలను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయరాదన్నారు. ఈ విషయం ఎస్పీ విద్యాసాగర్ నాయుడితో మాట్లాడతామన్నారు. అవాంఛనీయ సంఘటలను జరగకుండా సీఐ పసుపుల వెంకటేశ్వర్లు భద్రత కల్పించారు. రైల్వేకోడూరు సీఐ కే.హేమసుందరరావు బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారిణి సుభాషిణి, జిల్లా మార్కెటింగ్ ఏడీ త్యాగరాజు, రాజంపేట బ్రేక్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్, ఉద్యాన శాఖ అధికారి భాస్కర్, తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్, కూటమి నాయకులు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, రైల్వేకోడూరు క్లస్టర్ ఇన్‌చార్జ్ పఠాన్ మౌలా, గునిపాటి రాయుడు, పగడాల చంద్రశేఖర్, జోగినేని మణి, కొమ్మా శివ, గిరి తదితరులు పాల్గొన్నారు.

దమ్మ నిరసనకు అనుమతి లేదు: డీఎస్పీ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ మహేంద్ర

మదనపల్లె, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): బాస్ అధినేత పీటీఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో మదనపల్లెలో ఈ నెల 9న తలపెట్టిన 'దమ్మ నిరసన, చలో మదనపల్లె' కార్యక్రమానికి అనుమతి లేదని స్థానిక డీఎస్పీ మహేంద్ర ప్రకటించారు. స్థానిక వన్‌టౌన్‌పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ.. అంకిశెట్టిపల్లె సమీపంలోని నల్లగుట్టపై ఏర్పాటు చేసిన బుద్ధుని విగ్రహం ధ్వంసం ఘటనలో బాస్ నేతలు, వారి అనుచరులు పోలీసులపై చే స్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ధ్వంసం చేస్తే ఆ గ్రామ రెవెన్యూ అధికారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితులను గుర్తించినట్లు తెలిపారు. అయితే తాము చెప్పినట్లు వినలేదని, వారు రాసిచ్చినట్లు కేసు నమోదు చేయలేదనే కోపంతో పోలీసులపై అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. పోలీసుల అనుమతి లేకుండా శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా ఆందోళన లుచేశారని, అందుకే కేసులు పెట్టాల్సివచ్చిందని ఆయన స్పష్టం చేశారు. నిందితు లను అరెస్టు చేయలేదని మొదట్లో ఆందోళన చేయగా, తర్వాత కేసు విచారణలో నిందితులను గుర్తించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అయినా.. బాస్ నేతలు, వారి అనుచరులు పోలీసులపై నిందలు మోపుతూ వాట్సాప్, సోషల్ మీడియా, మీడియా సమావేశాల్లో అసత్యాలు ప్రచారం చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఇలా పోలీసులపై దుష్ప్రచారం చేస్తే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ మహేంద్ర హెచ్చరించారు. ఈ సమావేశంలో సీఐలు రామ చంద్ర, కళా వెంకట రమణ, ఎస్సై అన్వర్ బాషా, రెహ్మాన్ పాల్గొన్నారు.

ల్యాండ్రీ దుకాణంలో అగ్ని ప్రమాదం

- రూ. లక్ష ఆస్తి నష్టం
- సకాలంలో స్పందించిన ఫైర్, పోలీస్
- తప్పిన పెను ప్రమాదం



ల్యాండ్రీ దుకాణంలో ఎగసిపడుతున్న మంటలు



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పీలేరు రూరల్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): ల్యాండ్రీలో అగ్ని ప్రమాదం చోటు చేసుకోవడంతో పెద్ద ఎత్తున దుస్తులు కాలిపోయి రూ. లక్ష మేరకు నష్టం వాటిల్లినట్లు దుకాణ యజమాని శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని బోడుమల్లువారి పల్లెకు చెందిన శ్రీనివాసులు పట్టణంలోని జండామాను వద్ద నిర్వహిస్తున్న ల్యాండ్రీలో శుక్రవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలు ఆర్పేందుకు స్థానికులు చేసిన ప్రయత్నం ఫలించలేదు. ఈ సమాచారం అందుకున్న పీలేరు ఫైర్ స్టేషన్ సిబ్బంది , పోలీసులు సకాలంలో స్పందించి మంటలు చుట్టుపక్కల ఇళ్లకు వ్యాపించకుండా అదుపు చేశారు. పీలేరు అర్బన్ ఎస్ఐ లోకేశ్ తన సిబ్బందితో అక్కడే ఉండి ట్రాఫిక్‌ను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో దుస్తులతోపాటు కొంత నగదు కాలి బూడిదైంది. ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమై ఉంటుందని భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పీలేరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కార్యకర్తలకు గుర్తింపునిచ్చే ఏకైక పార్టీ టీడీపీ : సీఎం



జమ్మలమడుగు నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ప్రొద్దుటూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలను గుర్తించే బాధ్యత నాది... పార్టీదని, మీ బాధ్యత ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండటం అని.. నెలనెలా పెన్షన్లు పంచేటప్పుడు బూత్ కన్వీనర్ ఇంటింటికి వెళ్లి కనపడాలని... మన వల్లే పెన్షన్ వచ్చిందని గుర్తుంచుకుంటారని... రేపు ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా వారికి సైకిలే కనబడుతుందని.. కార్యకర్తలు అప్రమత్తంగా ఉంటే టీడీపీని ఓడించడం ఎవ్వరికీ సాధ్యం కాదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపు నిచ్చారు. శుక్రవారం జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశం ముద్దనూరు రోడ్డులోని నానుబాల ఫంక్షన్ హాలులో జరిగింది. ఈసమావేశానికి నియోజకవర్గ ఇన్‌చార్జి భూపేశ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీ నాయకులు ప్రజలు ఒప్పుకుంటేనే పార్టీలో రాష్ట్రస్థాయి నుంచి జిల్లా మండలస్థాయి వరకు పదవులు ఇస్తున్నామన్నారు. దేవదాయ పాలకమండళ్లు, మార్కెట్‌యార్డు కమిటీలలో, సాగునీటి సంఘాలలో పదవులు ఇస్తున్నామన్నారు. అన్ని స్థాయిలలో కార్యకర్తలకు గుర్తింపు నిచ్చే ఏకైకపార్టీ టీడీపీనే అన్నారు. అందువల్లే కోటి కుటుంబాలు టీడీపీతో ఉన్నాయన్నారు.

సూపర్‌సిక్స్ సూపర్ సక్సెస్

ఎన్నికల ముందు ప్రజలకు అమ లు చేస్తామన్న సూపర్ సిక్స్ పథకాలు సూపర్ సక్సెస్ అయ్యాయని అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. దేశంలో ఏ రాష్ట్రం ఇవ్వని రీతిలో రూ.32,116 కోట్ల రూపాయలు పెన్షన్లకు ఇస్తున్నామన్నారు. తల్లికి వందనం ఇంట్లో ఎంత మంది ఉంటే అంతమందికి ఇచ్చామని, పేదల కోసం అన్నా క్యాంటీన్లు, సంవత్సరానికి మూడు ఉచిత సిలిండర్లు అందజేస్తున్నామన్నారు. మత్స్యకారులకు పెన్షన్లు ఇస్తున్నామన్నారు. పదిరోజుల్లో 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తున్నామని తెలిపారు. ఆగస్టు 2న అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ.7వేలు ఇవ్వనున్నామన్నారు. ఆగస్టు 7న చేనేత కార్మికులకు 200 యూని ట్లు, పవర్‌లూమ్ కార్మికులకు 500 యూనిట్లు ఉచితంగా విద్యుత్ అందజేయనున్నామన్నారు. ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కూడా అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు.

11 సీట్లిచ్చినా రౌడీయిజం చేస్తున్నారు

రాష్ట్ర ప్రజలు వైసీపీకి 11 సీట్లిచ్చినా రౌడీయిజం చేస్తున్నారు. అబద్ధం నిజం చేస్తారు. నిజాన్ని అబద్ధం చేస్తారు. సాక్షిలో గుండెపోటు అంటే అయ్యోపాపం అనుకున్నా. సాయంకాలంకల్లా గొడ్డలిపోటన్నారు. తెల్లవారగానే నాచేతిలో కత్తిపెట్టి నారాసుర రక్త చరిత్ర అన్నారు. నేను హత్యలు చేసే వాణ్ణి కాదు. హత్యలు చేసేవాళ్లను మట్టికరిపిస్తా. ఫ్యాక్షన్ రాజకీయాల నుంచి రాయలసీమను కాపాడిన పార్టీ టీడీపీ అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో పోలవరం, అమరావతిలను విధ్వంసం చేశారు. నేడు విధ్వంసం నుంచి అభివృద్ధి వైపునకు, అప్పుల ఊబి నుంచి ఆర్థిక సమృద్ధివైపునకు తీసుకెళుతున్నాం అన్నారు. ఇక నేరస్థులు రాజకీయ ముసుగులో వస్తున్నారు.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పరామర్శలకు వెళ్లి అక్కడి నుంచి బెదిరించడం..నేను వస్తే తాటతీస్తాను అంటున్నారని... నేను రాజకీయాలు చేసేవరకు ఎవరి ఆటలు సాగనీయనన్నారు.

సింగపూరును అవమానించారు

ప్రపంచంలో అవినీతికి తావులేని దేశం సింగపూర్ అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం సింగపూరు ప్రభుత్వాన్ని అవమాన పరిచారన్నారు. టీడీపీ వచ్చాక రాష్ట్రంలో పెట్టుబడులకు నమ్మకం కలిగించామన్నారు. 30 ఏళ్ల నమ్మకంతో నన్ను వారు ఒదులుకోలేక పోయారు. మళ్లీ సింగపూర్‌తో సంబంధాలు మెరుగు పరుస్తున్నానన్నారు.

ప్రాజెక్టులు, పరిశ్రమలపై హామీలు

రైతాంగం కోసం రాజోలి రిజర్వాయర్ నిర్మాణం చేపడతామన్నారు. జమ్మలమడుగులో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీని ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. దాల్మియ సిమెంట్ ఫ్యాక్టరీ విస్తరణ పనులు చేపట్టడంతో పాటు ఆర్‌టీపీపీలో పెండింగ్ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

పులివెందుల జడ్పీటీసీ స్థానం గెలిచి చంద్రబాబుకు గిఫ్ట్ ఇస్తాం : బీటెక్ రవి



విలేకరులతో మాట్లాడుతున్న బీటెక్ రవి

పులివెందుల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ స్థానాన్ని కైవశం చేసుకొని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు గిఫ్ట్‌గా ఇస్తామని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పులివెందుల జడ్పీటీసీ స్థానానికి పోటీ చేసేందుకు అనుమతి ఇవ్వడంతో నామినేషన్ వేశామన్నారు. నా సతీమణి లతా రెడ్డి, తమ్ముడు భరత్‌రెడ్డిలు నామినేషన్లు వేశారన్నారు. అందరి సహకారంతో పులివెందుల జడ్పీటీసీ స్థానం కైవశం చేసుకుంటామన్నారు. పులివెందులలో టీడీపీ బలపేతానికి అహర్నిశలు కృషి చేస్తున్నామని.. గత అసెంబ్లీ ఎన్నికలలో 25శాతం పార్టీ ఇక్కడ ఉంటే.. 50 శాతానికి టీడీపీని బలోపేతం చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాల అమలుతో పులివెందులలో టీడీపీ బలపడేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు. అలాగే గత ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణాల్లో నష్టాలు వస్తాయని వైసీపీ నాయకులు వదిలేసిన గ్రావెల్ రోడ్లను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పూర్తి చేశామన్నారు కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం తథ్యం

కడప కలెక్టరేట్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ విజయం తథ్యమని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎన్‌డీ విజయజ్యోతి అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా అనిల్‌కుమార్ రెడ్డి, శివకళ్యాణరెడ్డిలు తమ నామినేషన్ పత్రాలను జిల్లా పరిషత్‌లో ఎన్నికల అధికారికి అందజేశారు. అంతకముందు విజయజ్యోతి మీడియాతో మాట్లాడుతూ పులివెందుల కాంగ్రెస్‌కు కంచుకోట అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆ ప్రాంత అభివృద్ధికి, ప్రజలకు ఎన్నో సేవలు చేశారని కొనియాడారు. వైఎస్ తనయురాలు పీసీసీ అధ్య క్షురాలు వైఎస్ షర్మిల నాయకత్వంలో పులివెందుల జడ్పీటీసి ఉప ఎన్నికలో విజయం సాధించడం ఖాయమని ఆమె ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అలీఖాన్, పులివెందుల ఇన్‌చార్జి ధ్రువకుమార్ రెడ్డి పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బి.మఠం ఎంపీపీ వైసీపీకి రాజీనామా



ఎంపీపీ వీరనారాయణరెడ్డి

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండల ప్రజాపరిషత్ చైర్మన్ (ఎంపీపీ) చిలేం కాంపల్లె వీరనారాయణరెడ్డి శుక్రవారం వైసీపీకి రాజీనామా చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ తన వ్యక్తిగత కారణాలతో తాను వైసీపీ సభ్యత్వానికి రాజీనామా చేశామన్నారు. రాజీనామా పత్రాన్ని పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాధరెడ్డి, వైసీపీ క్రమశిక్షణ సంఘం చైర్మన్, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డికి పంపినట్లు ఆయన తెలిపారు. త్వరలోనే టీడీపీలోకి వెళుతున్నట్లు ఎంపీపీ వెల్లడించారు.


పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు అన్నా చెల్లెళ్ల ఎంపిక



కడవకల్లు కమ్మయ్య, కడవకల్లు కల్పన

మైలవరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దన్నవాడ గ్రామానికి చెందిన అన్నా చెల్లెళ్లు కడవకల్లు కమ్మయ్య, కడవకల్లు కల్పన పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. శుక్రవారం విడుదలైన కానిస్టేబుల్ ఉద్యోగాల ఫలితాల్లో ఉద్యోగాలు సాధించి సత్తా చాటారు. దన్నవాడ గ్రామానికి చెందిన కడవకల్లు అప్పయ్య, జీవమ్మ దంపతుల కుమారుడు కడవకల్లు కమ్మయ్య, కుమార్తె కడవకల్లు కల్పనలు సివిల్ కానిస్టేబుల్స్‌గా ఎంపికయ్యారు. ఐదేళ్ల క్రితం తండ్రి అప్పయ్య మృతి చెందారు. తల్లి జీవమ్మ కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించేది. తల్లితో పాటు అన్నా చెల్లెలు కూడా కూలి పనులకు, పొలం పనులకు వెళ్లేవారు. ఎటువంటి శిక్షణ తీసుకోకుండా ఇంటిలోనే కష్టపడి చదువుకుని మెరుగైన ఫలితాలు సాధించి కానిస్టేబుల్స్‌గా ఎంపికకావడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వారి విద్యాభ్యాసం 1 నుంచి 5 వరకు దన్నవాడ ప్రభుత్వ పాఠశాల, 6 నుంచి 10 వరకు వద్దిరాల జడ్పీ హైస్కూలు, ఇంటర్, డిగ్రీ జమ్మలమడుగు ప్రభుత్వ జూనియర్ కాలేజీ, డిగ్రీ కాలేజీల్లో సాగింది.

చేనేత కుటుంబంలో అన్నదమ్ముళ్లకు...



లక్ష్మీనారాయణ, విజయనారాయణ

జమ్మలమడుగు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో ఒకే కుటుంబంలో ఇద్దరు అన్నదమ్ములు కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించి సత్తా చాటారు. చింతా చంద్రనారాయణ, శ్యామలాదేవి కుమారులు లక్ష్మీనారాయణ, విజయనారాయణ ఏపీఎస్పీ పోలీసులుగా ఎంపికయ్యారు. వీరి ఎంపిక పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఒకే కుటుంబంలో వదినా, మరిదికి..

కొండాపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొట్టిపాడు గ్రామానికి చెందిన వదినా, మరిదిలు శుక్రవారం విడుదలైన పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. గ్రామానికి చెందిన రైతు కుమ్మర నాగేంద్ర భార్య పావని, అతని తమ్ముడు కుమ్మర హర్షవర్దన్‌లు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. ఒకే కుటుంబంలో ఇద్దరు కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపిక కావడంతో వారి గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

గండికోట ప్రాజెక్టుకు చేరిన కృష్ణాజలాలు



జీఎన్ఎస్ఎస్ కెనాల్ ద్వారా గండికోట ప్రాజెక్టులోకి చేరుతున్న కృష్ణాజలాలు

కొండాపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టుకు కృష్ణాజలాలు శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటలకు చేరినట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అవుకు రిజర్వాయిర్ వద్ద జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి గురువారం నీటిని విడుదల చేయగా, జీఎన్ఎస్ఎస్ వరదకాలువ ద్వారా 53 కిలోమీటర్లు ప్రయాణించి గండికోట సొరంగం గుండా గండికోట ప్రాజెక్టులోకి నీరు ప్రవేశించినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం సుమారు 6000 క్యూసెక్కులు నీరు వస్తుండగా అది మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. అదే విధంగా గండికోట నుంచి మైలవరం జలాశయానికి 1500 క్యూసెక్కులు, సీబీఆర్‌కు 500 క్యూసెక్కులు, పైడిపాలెం రిజర్వాయిర్‌కు 300 క్యూసెక్కులు, జీఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్‌కు 150 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టులో శుక్రవారం 10.3 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ తెలిపారు. కాగా గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు.

పెన్నానదిలో ఇద్దరు వ్యక్తులు గల్లంతు

● ఒక మృతదేహం లభ్యం - మరొకరి కోసం పోలీసుల గాలింపు



పెన్నానదిలో ఇద్దరు వ్యక్తులు గల్లంతు అయిన నీటి గుంత ఇదే



మున్నా మృతదేహం

జమ్మలమడుగు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు-ముద్దనూరు రోడ్డులోని పెన్నానదిలో ఇద్దరు వ్యక్తులు ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటికుంటలో మునిగి గల్లంతయ్యారు. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గండికోటకు వెళ్లే సమయంలో వెలుగులోకి వచ్చింది. పోలీసల వివరాల మేరకు... కడపకు చెందిన గోపాల్ (36), మున్నా (38) ముఖ్యమంత్రి పర్యటన బారీకేడ్స్ కట్టేందుకు గురువారం జమ్మలమడుగుకు వచ్చినట్లు తెలిపారు. పనులు అయిపోయిన తర్వాత పెన్నానదిలో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు ఇద్దరు నీటి కుంటలో మునిగి గల్లంతు అయ్యారు. ఈ విషయం తెలిసిన పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి 8 గంటలకు మున్నా మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మరొకరి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ లింగప్ప తెలిపారు.

కులం పేరుతో దూషించిన కేసులో మూడేళ్ల జైలు శిక్ష


సింహాద్రిపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషించిన కేసులో వెలుగోటి రామలింగేశ్వరరెడ్డికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. 2018 మే 4వ తేదీ వెలుగోటి రామలింగేశ్వరరెడ్డి చింతలపల్లె అంకాళమ్మకు చెందిన పొలంలో అక్రమంగా ప్రవేశించి గుంతలు తీశాడు. ఈ విషయం తెలుసుకున్న అంకాలమ్మ రామలింగేశ్వరరెడ్డి ఇంటి వద్దకు వెళ్లి ఎందుకు మా పొలంలో గుంతలు తీశారు.. మీపైన కేసు పెడతామన్నారు. దీంతో రామలింగేశ్వరరెడ్డి కోపంతో అంకాళమ్మను ఆమె భర్తను కులం పేరుతో తిట్టి దూషించాడు. కేసు కాకపోతే ఏమైనా పెట్టుకోమని బెదిరించినట్లు, పొలాన్ని పాడుచేసి గుంతలు చేసినట్లు కేసు పెట్టారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి రామలింగేశ్వరరెడ్డిని కోర్టులో ప్రవేశపెట్టగా... విచారణలో నేరం రుజువు కావడంతో జడ్జి మూడేళ్ల జైలు, రూ.10వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు. కేసులో నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన పీపీ బాలాజీ, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారన్నారు.

5 నుంచి వైవీయూ డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షలు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): యోగి వేమ న విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ కళాశాలల రెండో సెమిస్టర్ విద్యార్థులకు ఈనెల 5వ తేదీ నుంచి ఇన్‌స్టంట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కేఎస్‌వీ కృష్ణారావు వెల్లడించారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బ్యాచిలర్ ఆఫ్ ఒకేషనల్ కోర్సులకు సంబంధించిన 2వ సెమిస్టర్ విద్యార్థులు హాజ రు కావాలని ఆయన సూచించారు. జిల్లాలోని అన్ని కళా శాలల విద్యార్థులు యోగివేమన విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని ఏపీజే అబ్దుల్ కలాం భవనంలో పరీక్షలు రాయాలన్నారు. విద్యార్థుల హాల్ టికెట్లను చదువుతున్న కళాశాల నుంచి పొందాలని సూచించారు.

బంగారు కుటుంబాలను ఆదుకుందాం

మార్గదర్శులతో సీఎం చంద్రబాబు



దీవెన కుటుంబాన్ని దత్తత తీసుకుంటామంటున్న ఎన్ఆర్ఐ రామమనోహర్‌రెడ్డి (మార్గదర్శి), నాగమ్మ కుంటుంబాన్ని ఆదుకుంటామంటున్న చెన్నారెడ్డి (మార్గదర్శి)

జమ్మలమడుగు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఇతర ప్రాంతాల్లో ఆర్థికంగా స్థిరపడినవారు సొంతూర్లోని బంగారు కుబుంటాలను ఆదుకోవాలి. ఈ విషయంలో మీరూ మేమూ కలసి వెళదాం.. అని మార్గదర్శులతో సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం జమ్మలమడుగు మండలం గూడెంచెరువు చేనేత కాలనీలో పింఛన్ల పంపిణీ అనంతరం ఆయన ప్రజావేదిక వద్దకు చేరుకున్నారు. ఇక్కడ బంగారు కుటుంబాలు, మార్గదర్శులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలువురు బంగారుకుటుంబాల్లోని వారు తమ స్థితిగతులను వివరించారు. వారిని ఆదుకుంటా మని అక్కడికక్కడే మార్గదర్శులు ప్రకటించారు. ఆ వివరాలు..

నేను ఎస్ఐని అవుతా... పది మందికి సాయపడతా...

నాపేరు దీవెన. బీఏ చదువుతున్నాను. నాన్నకు 2016లో రెండుసార్లు ఆపరేషన్లు జరిగాయి. రూ.6లక్షలు ఖర్చయ్యింది. మాకు చాలా ఇబ్బందులున్నాయి. అయినా నన్ను చదివిస్తున్నాడు. తమ్ముడ్ని కోల్పోయాం. అమ్మకు చెవుడు. మేము చాలా ఇబ్బందుల్లో ఉన్నాము సార్. మాకు సహాయం చెయ్యండి. ఎస్ఐని కావాలన్నది నా సంకల్పం సార్. నేను కూడా పదిమందికి సహాయపడతాను.

సీఎం: భూములేమైనా ఉన్నాయామ్మా...

దీవెన: లేవు సార్.

బాబు: మీనాన్న ఏం పనిచేస్తాడమ్మా....

దీవెన: పెయింటింగ్ పనిసార్. ఒకరోజు పని ఉంటే వారం రోజులు పనివుండదు. ఆయన మీదే మేము ఆధారపడి బతుకుతున్నాం సార్. మీరే మాకు సహాయం చెయ్యాలని కన్నీరు పెట్టడంతో సీఎం చంద్రబాబు బాలికను ఓదార్చారు. బాధపడవద్దు నేనున్నాను.

మీరిచ్చిన స్ఫూర్తే...- రామమనోహర్‌రెడ్డి, ఎన్ఆర్ఐ

దీవెనను నాకు కలెక్టర్ పరిచయం చేశారు. ఆమె కుటుంబ పరిస్థితిని తెలుసుకున్నాను. దీవెన బాగా చదువుకుని ఎస్ఐ కావాలనే లక్ష్యం ఉంది. ఆమె ఉన్నత చదువులకు అయ్యే ఖర్చును పూర్తిగా భరిస్తాను. అలాగే ఆమె తండ్రి భాస్కర్ జీవనోపాధి కోసం ఆటో కావాలని అడిగారు. అది కూడా ఏర్పాటు చేస్తాను. పీ4 అనే ఉద్యమం అనేది 2016లో కూడా స్మార్ట్ వార్డు-స్మార్ట్ విలేజ్‌గా చేశారు. మీ పిలుపు మేరకు ప్రస్తుత సీఎస్ విజయానంద్ కలిసి జమ్మలమడుగు మండలంలోని ఎస్.ఉప్పలపాడు గ్రామాన్ని దత్తత తీసుకుని 2019 ఫిబ్రవరి నాటికి సంపూర్ణ ఆదర్శ గ్రామంగా మీ చేతులమీదుగా అవార్డు తీసుకున్నాము. విద్య, స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి అన్ని కార్యక్రమాలను దత్తత తీసుకుంటాం సార్. 500 మందికి ఉపాధి కల్పించాము. ఇంకా ఎవరైన అర్హులుంటే వారందరికీ పని కల్పిస్తాం సార్.

బాబు: ఒక విజన్ తయారు చేసి షార్ట్‌టర్మ్, మిడిల్ టర్మ్, లాంగ్ టర్మ్‌గా డెవలప్‌మెంట్ చెయ్యండి. ఎంతమంది ఉంటే అందరినీ హోలిస్టిక్‌గా అభివృద్ధి చేయాలి.

==================

నాగమ్మ : నా పేరు నాగమ్మ, భర్త లక్ష్మయ్య, మామ నాగయ్య అత్త బాలమ్మ సార్. మేము వడ్డోళ్లం.

బాబు: పిల్లలేం చేస్తారమ్మా...

నాగమ్మ: ఒకరు చదువుకుంటున్నారు. ఒకరు 8నెలల పాప. మేము రోళ్లు చేసుకుంటూ బతుకుతున్నాము. ప్రస్తుతం చాలా ఇబ్బందిగా ఉంది సార్. గ్యాండరు (గ్రైండరు), మిక్సీలు వచ్చిందానివల్ల యాపారం చానా పడిపోయింది. ఇంట్లోకి ఒక్క రూపాయి కూడా రాదు సార్. దీనివల్ల చాలా ఇబ్బందిగా ఉంది.

బాబు: తల్లికి వందనం పడిందామ్మా

నాగమ్మ: పడింది సార్.

బాబు: గ్యాస్ వస్తోందా...

నాగమ్మ: లేదు సార్.

బాబు: వెంటనే పెట్టుకో కనెక్షన్ ఇస్తారు.

నాగమ్మ కుటుంబాన్ని ఆదుకుంటా... చెన్నారెడ్డి

మైలవరం మండలంలోని చిన్నవెంతుర్ల గ్రామానికి చెందిన రైతు కుటుంబంలో పుట్టి 30 సంవత్సరాల క్రితం హైదరాబాదుకు వెళ్లాను సార్. కన్‌స్ట్రక్షన్‌లో బాగా రాణించాను. అక్కడ ముగ్గురు పిల్లల్ని చదివిస్తున్నాను. నాగమ్మ పిల్లలకు కావాల్సిన విద్య, ఆరోగ్యం, భర్తకు ఆటో కూడా ఇప్పిస్తాను సార్. మరో పది కుటుంబాలకు ఆర్థికంగా సహాయం చేస్తాను.

చంద్రబాబు: మీరు మేము కలిసి ముందుకెళదాం.

అవ్వాతాతలకు ఆర్థిక భరోసా



కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అవ్వాతాతలకు ఆర్థిక భరోసా కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కడప నగరం ఎర్రముక్కపల్లె ప్రాంతంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయనపాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శివశంకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు ఫక్రుద్దీన్, సుబ్బరాయుడు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

37వ డివిజన్..: కడప నగరం 37 డివిజన్‌లో ఇన్‌చార్జి షేక్ జియావుద్దీన్ అధ్యక్షతన టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు శ్రావణ్ రాజ్‌రెడ్డి పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమేష్‌బాబు, శేఖర్, గోవర్ధన్, ఇబ్రహీం పాల్గొన్నారు.

కడప నాగరాజుపేట..: పింఛన్‌ల పంపిణీతో అవ్వతాత కళ్లలో ఆనందం వెల్లివిరుస్తోందని టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకుడు లయన్ పటాన్ ఖాదర్‌బాష, 165వ బూత్‌ఇన్‌చార్జి అమానుల్లా పేర్కొన్నారు. శుక్రవారం 27వ డివిజన్ గౌస్‌నగర్‌లో ఇంటింటికి వెళ్లి పింఛన్ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

వేంపల్లె, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుకు గురైనసమయంలో వెంటనే చేపట్టాల్సిన సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కడప వేదాంత హాస్పిటల్ గుండెవైద్య నిపుణుడు శ్రావణ్‌కుమార్ సూచించారు. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ఉద్యోగులకు, విద్యార్థులకు సీపీఆర్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహజంచారు. గుండెపోటుకు గురైన వ్యక్తికి మొదట పల్స్ చెక్ చేయాలని సుమారు గంటపాటు సీపీఆర్ చేయాలని తెలిపారు. చేసే విధానం గురించి తెలియజెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రావణ్ కుమార్‌ను, వేంపల్లెకు చెందిన డాక్టర్ బాషను ట్రిపుల్‌ఐటీ అధికారులు, ఉద్యోగులు సత్కరించారు. డైరెక్టర్ కుమారస్వామి గుప్త, ఏఓ రవికుమార్, డీన్ కైలాష్, కో-ఆర్డినేటర్ దీప్తి, ట్రిపుల్‌ఐటీ ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

స.హ.చ.పై విద్యార్థులకు అవగాహన పోటీలు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఎస్‌కేఆర్‌అండ్‌ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నోడల్ రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం -2005పై ఇంటర్-కళాశాల పోటీలు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ యాక్ట్) 2005 అమలులోకి వచ్చి 20 వసంతాల ఉత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వేముల సలీంబాష, ఆర్‌టిఐ పరిశోధకులు యోగివేమన విశ్వవిద్యాలయం జర్నలిజం శాఖ అధ్యాపకులు డాక్టర్ తుమ్మలూరు సురేష్‌బాబు, లీగల్‌ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ డిప్యూటీ చీఫ్ ఎం.శాంత పోటీలను ప్రారంభించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమ నిర్వహణను ఎన్‌ఆర్‌సీ సమన్వయకర్త డాక్టర్ ఎల్.రాజమోహన్‌రెడ్డి అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఎంత కాలం..?

- నష్టపరిహారం హుళక్కేనా
- నీటి మూటలుగా మారిన నేతలు, అధికారుల మాటలు
- ఆశగా ఎదురు చూస్తున్న ఆర్టీసీ బస్టాండు అద్దె రూముల యజమానులు



బస్టాండు వద్ద ఉన్న అద్దె రూముల ముందు ఎక్స్‌కవేటర్‌తో పూడిక తీస్తున్న దృశ్యం (ఫైల్)

కడప మారుతీనగర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కడప బస్టాండుకు ముందు భాగం, అంబేడ్కర్ సర్కిల్, అవుట్‌గేట్ వరకు గల ఆర్టీసీకి సంబంధించిన అద్దె గదులున్నాయి. వాటి నుంచి నెలకు ఒక్కోషాపునకు రూ.దాదాపు 30వేల రూపాయల నుంచి రూ.లక్ష వరకు అద్దెరూపంలో ఆర్టీసీకి లభిస్తుంది. ఇదిలా ఉండగా, కడపలో వర్షాలు పడినప్పుడు అటు గ్యారేజీలో, ఇటు బస్టాండులో ముందు వైపు గల రోడ్డులో వర్షం నీరు నిల్వ ఉండి అటు ఇటు రాకపోకలు సాగించే అన్ని రకాల వాహనాలకు ఇబ్బంది కరంగా ఉండేది. దాన్ని దృష్టిలో ఉంచుకుని బస్టాండుకు ముందు వైపు ఉన్న పెద్ద డ్రైనేజీ కాల్వను 2024 నవంబరు నెల నుంచి బస్టాండు ఇన్ గేటు నుంచి అవుట్ గేటు వరకు ఎక్స్‌కవేటర్ సాయంతో కార్పొరేషన్ అధికారులు మరమ్మతులు చేయించిన సంగతి తెలిసిందే అప్పట్లో దాదాపు ఆ డ్రైనేజీ కాల్వ పూర్తి కావడానికి ఆరు నెలల సమయం పట్టింది. ఎక్స్‌కవేటర్‌తో తీసిన పూడిక షాపుల ముందు పడేయడంతో సంబంధిత వ్యాపార సముదాయాలకు వినియోగదారుల నుంచి సరైన వ్యాపారాలు లేక మూత వేసుకున్నారు. దీంతో నాటి నగర కమిషనర్, కడప ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ఆ షాపుల యజమానులు వారికి కలిగిన నష్టాన్ని తెలియచేసుకున్నారు. కాగా అప్పట్లో వారు ఈ విషయాన్ని సంబంధిత ఆర్టీసీ అ ధికారుల దృష్టికి తీసుకెళ్లి ఏదేని నష్టపరిహారం చెల్లించి వారికి సముచిత న్యాయం చేయాలని సూచించారు. పైపెచ్చు అప్పట్లో పూడిక తీసిన వారు సరైన రీతిలో తీయకపోవడంతో షాపుల యజమానులు తిరిగి ఆ షాపుల వద్ద ఎలివేషన్, ప్లాట్‌ఫారం, లైటింగ్‌బోర్డు తదితర వాటిని సొంత ఖర్చులతో అమర్చుకోవాల్సి వచ్చింది. ఓ వైపు నష్టపరిహారం రాక,మరో వైపు షాపులకు కొత్త షోకులు చేసుకోవడంతో యజమానులు గిలగిల్లాడుతున్నారు. నష్టపరిహారం కోసం దాదాపు తొమ్మిది నెలలుగా కళ్లల్లో ఒత్తులు వేసుకుని మరీ ఎదురు చూస్తున్నారు. దీంతో ఇటు అధికారుల మాటలు, అటు నేతల మాటలు నీటిమూటలుగా మిగిలిపోతున్నాయని ఆ షాపు యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం మానవత్వంతో అయినా ఆర్టీసీ అధికారులు నష్టపరిహారం చెల్లిస్తారని ఎదురు చూసిన యజమానులకు ఆశ నిరాశగా మారింది. పైపెచ్చు నష్టపరిహారం చెల్లించకపోగా నెలనెలా అద్దెను ముక్కుపిండి మరీ వసూలు చేస్తూ సకాలంలో ఇవ్వనివారికి వడ్డీ వేసి మరీ గుంజుతున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా ఆ

అందని ద్రాక్షలా నష్టపరిహారం

నష్టపరిహారం అందుతుందని తొమ్మిదినెలలుగా ఎదురు చూస్తున్న మాకు అది అందని ద్రాక్షపండులా మారింది. ఇటు నాయకులు, అటు అధికారులు తమకు న్యాయం చేస్తారని చాలా ఆశగా ఉండేది. ప్రస్తుతం ఆ ఆశ అడియాసగా మారుతోంది. ఇంకా ఎంతకాలం ఎదురు చూడాలో అర్థం కావడంలేదు.

- బాబు, ఆర్టీసీ అద్దె రూము బాధితుడు



నష్టపరిహారం విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకుని స్పందించి నష్టపోయిన కాలానికి తమకు పరిహారం అందేలా చూడాలని దుకాణ యజమానులు కోరుతున్నారు.

రేపటి నుంచి ఉపకరణాల పంపిణీ

సీకేదిన్నె, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, వృద్ధులకు అవసరమైన ఉపకరణాలకు స్థానిక ఏఎన్‌ఎం, వెల్ఫేర్ అసిస్టెంట్ల వద్ద సమాచారం తెలుసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో టి.వి.సుబ్బారెడ్డి తెలిపారు. మండలంలోని అర్హులైన దివ్యాంగులు, వృద్ధులకు అవసరమైన సహాయ ఉపకరణాల పంపిణీ కోసం కడప శంకరాపురంలోని ప్రభుత్వ అంధుల పాఠశాలలో మూడో తేదీ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు హాజరై ఉపకరణాలను పొందవచ్చన్నారు. ఈ శిబిరంలో త్రిచక్ర వాహనాలు, వీల్‌చైర్లు, కృత్రిమ కాళ్లు, చేతులు, వినికిడి వస్తువులు, రోలేటర్లు, వాకింగ్‌ఫ్రేమ్‌లు తదితర వస్తువులు పంపిణీ చేస్తామన్నారు. ఇందుకు అవసరమైన పత్రాలను యూడీఐడీ దివ్యాంగ గుర్తింపుకార్డు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఇన్‌కం సర్టిఫికెట్, పాస్ట్‌పోర్టు సైజ్ ఫొటోలు 2, ఫోన్ నంబరు తీసుకురావాలన్నారు. వృద్ధులకు రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, ఆదాయ ధృవీకరణ పత్రం, 4 పాస్ పోర్టు సైజు ఫొటోలు తీసుకుని హాజరుకావాలని తెలియజేశారు.ఏఎన్‌ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వారి పరిధిలోని అర్హులను గుర్తించి వారికి సమాచారాన్ని చేరవేయాలన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దుచేయాలి

కడప సెవెన్ రోడ్స్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని పెంచిన ఇంధన సర్దుబాటు చార్జీలు ఉపసంహరించుకోవాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం కడప ఏడు రోడ్ల సర్కిల్ గోకుల్ సర్కిల్ వన్ టౌన్ మీదుగా ఆర్డీఓ ఆఫీస్ వరకు నిరసన ర్యాలీ కరపత్రాల ప్రచారం నిర్వహించారు. అనంతరం వామపక్ష కార్మిక సంఘాల జిల్లా కార్యదర్శులు నాగసుబ్బారెడ్డి, మనోహర్ మాట్లాడుతూ ఆగస్టు 5న విద్యుత్ భవన్ ఎదుట జరిగే ఆందోళనను జయప్రదం చేయాలని కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు రామ్మోహన్, వెంకటశివ తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు చేయాలి

లింగాల,ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ 2025లో పంటలు సాగుచేసిన రైతుల వివరాలను పారదర్శకంగా నమోదు చేయాలని పులివెందుల ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఇప్పట్ల గ్రామంలో శుక్రవారం ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఏఓ రమేష్ మాట్లాడుతూ ఈ-క్రాప్‌లో ఎటువంటి వ్యత్యాసాలులేకుండా నమోదు చేయాలని మండల, డివిజన్, జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులతో తనిఖీలుంటాయని తెలిపారు.

ఆటో బోల్తా... ఇద్దరికి గాయాలు



పెండ్లిమర్రి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కడప -పులివెందుల ప్రధాన రహదారిపై శుక్రవారం మిన్నయ్యగారిపల్లె సమీపంలో ఉల్లిపాయల ఆటో బోల్తా పడి ఇద్దరికి గాయాలయ్యాయి.నందిమండలం గ్రామానికి చెందిన తల్లీ కొడుకులు ఆటోలో ఉల్లిపాయలు వేసుకుని గ్రామాల్లో తిరుగుతూ అమ్ముకునేవారు.పక్క గ్రామానికి వెళుతుండగా ఆటో టైరు పంచర్ కావడంతో అదుపు బోల్తా పడింది. అయితే పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.సంఘటనా స్థలానికి ఏఎస్ఐ చేరుకుని గాయపడ్డ వారిని ఆసుపత్రికి తరలించారు.

కనులపండువగా సుమంగళి పూజ



కడప కల్చరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా నగర బిల్టప్ సమీపంలోని విజయదుర్గమ్మ ఆలయంలో కనులపండువగా సుమంగళి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో వేకువజామునే అమ్మవారికి విశేష పంచామృతాభిషేకం అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం10.3గంటలకు ఆలయ ఉత్సవ మండపంలో వేద పండితులు సుమంగళి పూజ అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దఎత్తున మహిళా భక్తులు పాల్గొని అమ్మవారికి కుంకుమార్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం రాత్రి 8గంంలకు అమ్మవారికి పల్లకీసేవ ఏర్పాటు చేశారు. వచ్చే మూడో శ్రావణ శుక్రవారం సందర్భంగా 8న వరలక్ష్మీ వ్రతాన్ని వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. దీంతో పాటు 9న శ్రావణ పౌర్ణమినాడు, అలాగే 10న ఆదివారం శ్రీవిజయదుర్గా సమేత మల్లికార్జునస్వామివారి కల్యాణం వైభవంగా జరపనున్నట్లు ఆలయ నిర్వాహకులు వెల్లడించారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

'అక్రమాలకు పాల్పడుతున్న వీసీని తొలగించాలి'

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఇన్‌చార్జి వైస్‌చాన్సలర్ అల్లం శ్రీనివాసులు కాన్వకేషన్ ముసుగులో పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతున్నారని అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్, ప్రగతిశిల విద్యార్థి సంఘం రాష్ట్రకార్యదర్శి సుబ్బరాయుడు, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అంకన్న, అఖిలభారత విద్యార్థి బ్లాక్ జిల్లా కన్వీనర్ నగిలి రాజేంద్రప్రసాద్ ఆరోపించారు. శుక్రవారం వైవీయు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మకు వారు వినతిపత్రం సమర్పించారు.

సమాజసేవకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలి

లింగాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సమాజసేవకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ప్రముఖ పారిశ్రామిక వేత్త నరెడ్డి శివప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇప్పట్ల సమీపంలో ఉన్న లీలావతి చారిటబుల్ అనాథవృద్ధాశ్రమం 16వ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఏ ఆసరాలేనివారికి నేనున్నానంటూ మూలి కిరణ్‌కుమార్‌రెడ్డి ముందుకు వచ్చి సమాజ సేవ చేయడం అభినందనీయమన్నారు. పులివెందుల జేఎన్టీయూ, చైతన్య కళాశాల విద్యార్థులు 65 మంది రక్తదానం చేశారు. మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ విశ్రాంతడైరెక్టర్ ప్రసాద్‌రెడ్డి, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట బందోబస్తు

కడప క్రైం, ఆగష్టు 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారాచంద్ర బాబు జమ్మలమడుగు, గండికోట పర్యటన సందర్భంగా శుక్రవారం కర్నూలు రేంజ్ డీఐజీడాక్టర్ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పటిష్ట భద్రతాచర్యలు చేపట్టారు. ఎలాంటి ఘటనకు తావు లేకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

రేపు ట్రిపుల్‌ఐటీలో జిల్లాస్థాయి యోగాపోటీలు

వేంపల్లె, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ఈనెల 3వ తేదీన జిల్లాస్థాయి యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు వైఎస్‌ఎస్‌ఏపీ అధ్యక్షురాలు రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు అందజేయడంతో పాటు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచినవారు 9959259211, 9963628927నెంబర్లను సంప్రదించాలని ఆమె ఆ ప్రకటనలో కోరారు.

'చంద్రబాబు మీద జగన్‌రెడ్డికి ఎంత కక్షో..'

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రపంచదేశాలకు పరిచయం చేసి పెట్టుబడులుతెచ్చే ప్రయత్నంలో ఉంటే మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కక్షకట్టే ప్రయత్నంలో ఉన్నారని టీడీపీ కడప జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అక్బర్ అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అంటే చంద్రబాబుకు సరిపోదు అని అందుకే ఎంపీ మిథున్‌రెడ్డిని జైల్లో పెట్టారని ప్రజలను నమ్మబలికే మాటలు మాట్లాడుతున్నారని వారి మాటలను ఖండిస్తున్నామని అన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

వేముల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈనెల 20 నుంచి 25వ తేదీల్లో జరగనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకటరాములు పిలుపునిచ్చారు. శుక్రవారం వేములలో వెంకటరాములు విలేకరులతో మాట్లాడుతూ మోదీ, బాబు డబుల్ ఇంజన్ సర్కార్ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారని, రాష్ట్రాభివృద్ధి కోసం కేంద్రం చేసిందేమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు ఈశ్వరయ్య, నాయకులు చాంద్‌బాష, అమీర్‌బాష, ఓబయ్య, సిద్దారెడ్డి తదితరులుపాల్గొన్నారు.

ఉపాధి హామీలో నూతన విధానాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి

కమలాపురం రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయక్తంగా చేపట్టిన మహాత్మాగాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకంలో నూతన అప్లికేషన్ పద్ధతిని సమర్థవంతంగానిర్వహించాలని ఏపీడీ సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం కమలాపురం క్లస్టర్ పరిధిలోని కమలాపురం వల్లూరు,ఎర్రగుంట్ల మండలాల్లో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న సాంకేతిక సహాయకులు, క్షేత్రసహాయకులకు శిక్షణ కార్యక్రమం శ్రీశక్తిభవన్ సభాభవన్‌లో నిర్వహించారు.

ఏపీఎల్‌లో క్రీడాకారులు సత్తా చాటాలి

- కడప క్రికెట్ స్టేడియం చైర్మన్ శ్రావణ్‌రాజ్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్రావణ్‌రాజ్‌రెడ్డి

కడప స్పోర్ట్స్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): విశాఖ పట్టణంలో ఈ నెల 8వతేదీ నుంచి 23 వరకు జరగనున్న ఏపీఎల్ క్రికెట్ పోటీల్లో రాయల్స్ ఆఫ్ రాయలసీమ క్రికెట్ జట్టు గెలుపే లక్ష్యంగా మెరుగైన ఆట తీరుతో విజయ తీరాలకు చేరాలని కడప క్రికెట్ స్టేడియం చైర్మన్ శ్రావణ్‌రాజ్‌రెడ్డి ఆకాంక్షించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక రిమ్స్ సమీప ఏసీఏ క్రికెట్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అక్షర ఎంటర్‌ప్రైజెస్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సంస్థ వ్యవస్థాపకుడు శ్రీధర్ కో చైర్మన్ రాజారెడ్డి, క్రికెట్ క్రీడాకారులు రషీద్, అవినాష్, కోచ్ పైడికాల్వ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను దోపిడీ చేస్తున్న ఎరువుల దుకాణాల యజమానులు

కడప సెవెన్ రోడ్స్ ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రైతులను ఎరువులదుకాణాలు యజమానులు దోపిడీ చేస్తున్నారని, అన్నదాతలతో ఎరువుల దుకాణదారుల ఆటలాడుకుంటున్నార సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ ఆరోపించారు. శుక్రవారం స్థానిక సీపీఎం జిల్లా కార్యాలయంలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సీపీఎం జిల్లా కమిటీ ఎరువుల కొరతపై విలేకరుల సమావేశం నిర్వహించారు. వ్యవసాయ శాఖ అధికారులు విజిలెన్స్ అధికారులు మామూళ్ల కోసం రైతుల గోడుచెవికి ఎక్కించుకోవడం లేదన్నారు. ఎరువుల దుకాణదారులు రెచ్చిపోతున్నారని, యూరియా కృత్రిమ కొరతసృష్టిస్తున్నారన్నారు. రైతుల అవసరాన్ని సొమ్ము చేసుకుంటున్నారని, ఖరీఫ్ సీజన్ ప్రారంభంకావడంతో రైతులకు యూరియా ఆవశ్యకత గుర్తించి రైతులను ఎరువుల దుకాణదారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రామ్మోహన్, బి.మనోహర్, వి.అన్వేష్, జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలించిన అధికారులు

పులివెందుల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా బ్యాలెట్ బాక్సులు భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్‌ను శుక్రవారం అధికారులు పరిశీలించారు. జేఎన్టీయూలోని ఓ బ్లాక్‌లో బ్యాలెట్ బాక్సులను భద్రపరిచేందుకు అక్కడున్న వసతులను పరిశీలించారు. బ్యాలెట్ బాక్సులు భద్రపరిచేందుకు అవసరమైన భద్రత తదితర వాటిని తహసీల్దార్ నజీర్ అహ్మద్, ఎంపీడీఓ కృష్ణమూర్తి,అర్బన్ సీఐ చాంద్‌బాష పరిశీలించారు. బ్యాలెట్ బాక్సులు భద్రపరిచేందుకు ఆ భవనం అన్ని విధాలుగా అనుకూలంగా ఉంటుందని అధికారులు అభిప్రాయపడ్డారు.

ముత్యాల అలంకరణలో కన్యకాపరమేశ్వరి

వేంపల్లె, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె అమ్మవారిశాలలో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు ముత్యాల అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. శ్రావణమాసం శుక్రవారం పురస్కరించుకొని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ఉదయం అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రాకారోత్సవం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్, మహిళా మండలి అధ్యక్షురాలు బాగేశ్వరమ్మ, యువజన సంఘం అధ్యక్షులు రాయవరం సుబ్బారావు, ఆవోపా మహిళా విభాగం అధ్యక్షురాలు నాగలక్ష్మి, మోహన్‌రావు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కడప విమానాశ్రయంలో శుక్రవారం సీఎం చంద్రబాబుతో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్

రెండో శ్రావణ శనివారం ఏర్పాట్లు పూర్తి



చక్రాయపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో జరిగే శ్రావణ మాసమహోత్సవాల సందర్భంగా రెండో శనివారం ఏర్పాట్లు పూర్తిచేశారు. సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, సేవా కమిటీ సభ్యులు,మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, చైర్మన్ కృష్ణతేజ వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లుచేశారు. కటౌట్లు ఏర్పాటుచేశారు. భక్తులకు తాగునీరు, స్నానాలు చేసేందుకు షవర్లు ఏర్పాటుచేశారు. గర్భాలయాన్ని పూలతో అలంకరణ, ఆంజనేయస్వామిని తోమాలలతో అలంకరించారు. ఆలయాన్ని విద్యుత్ అలంకరణలు చేశారు. భక్తులకు లడ్డు, పులిహోర ప్యాకెట్లు ఏర్పాటుచేశారు.



వేధిస్తున్న యూరియా కొరత

●పోరుమామిళ్ల వ్యవసాయ డివిజనులో రైతుల పాట్లు ●అధిక ధరలకు విక్రయిస్తున్నారంటూ ఆరోపణలు ●ఎమ్మార్పీకే ఇవ్వాలంటున్న అధికారులు



పోరుమామిళ్ల వ్యవసాయ డివిజనులో ఉన్న యూరియా బస్తాలు



ఎరువు దుకాణదారులతో మాట్లాతున్న ఏడీఏ మురళీధర్‌రెడ్డి

పోరుమామిళ్ల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల వ్యవసాయ డివిజను పరిధిలోని పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బికోడూరు మండలాల్లో యూరియా కొరత రైతన్నలను వేధిస్తోంది. దీంతో రైతులు యూరియా కోసం ఎగబడుతుండడంతో ఎరువుల దుకాణాదారులు ఎమ్మార్పీ కంటే అధిక ధరలు వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాధికారులు మాత్రం ఎమ్మార్పీకే యూరియా అమ్మకాలు జరపాలని లేదంటే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. ఖరీఫ్ సీజను ప్రారంభమై చాలా వరకు పంటలు సాగులో ఉండడంతో రైతులకు యూరియా ఎక్కువగా అవసరం కావాల్సి వచ్చింది. పోరుమామిళ్ల వ్యవసాయ డివిజనులో 4వేల హెక్టార్లు సుమారు 10వేల ఎకరాలలో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. ఈ పంటలకు దాదాపు 750 నుంచి వెయ్యి టన్నుల యూరియా అవసరం అవుతుంది. కాగా ప్రస్తుతం దాదాపు వంద టన్నులు మాత్రమే మంజూరయ్యాయి. అంతేకాక బి.కోడూరు, కాశినాయనలో ఎక్కువగా ఎరువుల దుకాణాలు లేకపోవడంతో మిగతా మండలాల వారు పోరుమామిళ్ల మీదే ఆధారపడి ఉన్నారు. బద్వేలు ఒంగోలు తదితర ప్రాంతాల నుంచి కూడా పోరుమామిళ్లకు ఎరువుల కొనుగోలుకు రైతులు వస్తుండడంతో యూరియాకు డిమాండ్ ఏర్పడింది. దీంతో బస్తా రూ.266.50 లకు అమ్మాల్సి ఉండగా రూ.400 డిమాండ్ చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. పంటలు దక్కించుకోవాలంటే యూరియా అవసరమని, అందుకోసం ఎరువుల దుకాణాలకు వెళితే అధిక ధరలు డమాండ్ చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఎరవుల దుకాణ యజమానులు మాత్రం తమకు కంపెనీ వారు ఎరువులతో పాటు నానో యూరియా కూడా అంటగడుతున్నారని బస్తా లిక్విడ్ రూ.300 చెల్లించాల్సి వస్తుందని, నానో యూరియా తీసుకుంటేనే మిగిలిన యూరియా సరఫరా చేస్తామని హోల్‌సేల్ దుకాణ యజమానులు ఆల్టిమేటం జారీ చేయడంతో తప్పనిసరి స్థితిలో యరియాతో పాటు నానో యూరియా కూడా కొనుగోలుచేయల్సి వస్తుందన్నారు. ఎమ్మార్పీ కే యూరియా అమ్మకాలు జరిగితే తాము నష్టాల బారిన పడాల్సి వస్తుందని ఇలాగైతే వ్యాపారాలు మానుకోవాల్సి వస్తుందని వ్యాపారస్తులు వాపోతున్నారు. శుక్రవారం పోరుమామిళ్లలో కొన్ని ఎరువుల దుకాణాల్లో యూరియా అధిక ధరలకు విక్రయిస్తున్నారని రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

ఎమ్మార్పీకే యూరియాను విక్రయించాలి

ఎమ్మార్పీకే యూరియా విక్రయించాలని లేదంటే చర్యలు తప్పవని వ్యవసాయ సహాయ సంచాలకుడు మురళీరెడ్డి హెచ్చరించారు. ఏవో చంద్రహాసరెడ్డితో కలిసి స్థానిక వ్యవసాయ కార్యాలయంలో యూరియా ఎరువుల దుకాణా యజమానుతో సమావేశం నిర్వహించి ఖచ్చితంగా ఎమ్మార్పీకే యూరియా విక్రయించాలని ఆదేశించారు. ఎరువుల దుకాణాల్లో తమ సిబ్బందిని ఉంచి అమ్మకాలు జరిపారు. రైతు సేవా కేంద్రాల్లోనే యూరియా అందేస్తే ఎమ్మార్పీకే కొనుగోలు చేయవచ్చని రైతులు పేర్కొంటున్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మి వ్రత పూజలు



సామూహిక వరలక్ష్మి వ్రతం చేస్తున్న మహిళలు

మైదుకూరు రూరల్, ఆగస్ట్ 1(ఆంధ్రజ్యోతి) :.స్థానిక లక్ష్మీమాధవరాయస్వామి ఆలయంలో శ్రావణమాస శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రత పూజలను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అచలానంద ఆశ్రమ పీఠాధిపతి విరజానందస్వామి పాల్గొని మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం ఆచరించడం సంతోషదాయకమన్నారు. ఈ క్రార్యక్రమంలో ఆలయ నిర్వాహకుడు బండి సుబ్బరాయుడు పాల్గొన్నారు.

కనదుర్గమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు



అలంకారంలో అమ్మవారు

బద్వేలుటౌన్, ఆగస్ట్ 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో వెలసిన కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శ్రావణ మాసం 2వ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో రాహుకాల దీపాలు వెలిగించి అమ్మవారిని దర్శించుకొని భక్తులు మొక్కులను చెల్లించుకున్నారు. ఆలయ కమిటీవారు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

సిమెంటు రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

దువ్వూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు గ్రామ పంచాయతీలో రెండు చోట్ల సిమెంటు రోడ్లనిర్మాణ పనులను మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంకు సంబంధించి రూ.10 లక్షలతో ప్రారంభించారు. మెయిన్ రోడ్డు నుంచి జడ్పీ హైస్కూలు వరకు సిమెంటు రోడ్డు పనులు శుక్రవారం 15వ ఫైనాన్స్‌కు సంబంధించి రూ.4 లక్షలతో క్రిస్టియన్ వాడలో సిమెంటు రోడ్డు నిర్మిస్తున్నట్లు పంచాయతీరాజ్ ఏఈ సుబ్రమణ్యం తెలిపారు.

టీడీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడిగా సంతోష్

జమ్మలమడుగు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): దిగువపట్నం కాలనీకి చెందిన బీరు గురప్ప అలియాస్ సంతోష్, జిల్లా టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడిగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నియమించినట్లు తెలిపారు. కార్యకర్తల సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో సంతోష్ పార్టీకి చేసిన సేవలను గురించి తెలిపారు. అక్కడే సీఎం టీడీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు సంతోష్ నియమించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పింఛను ఇప్పించండి మహాప్రభో

పోరుమామిళ్ల, ఆగష్టు 1 (ఆంధ్రజ్యోతి): తనకు పింఛను ఇప్పించాలని రంగసముద్రం పంచాయతీపరిధిలోని షేక్ నజీరున్నీసా అనే వితంతవురాలు అధికారులకు మొరపెట్టుకుంది. శుక్రవారం ఆమె రంగసముద్రం పంచా యతీ కార్యాలయం ఎదుట ఆవేదన వ్యక్తం చేసింది. తన భర్త చనిపోయి మూడేళ్లు అవుతున్నా అధికారులు తిప్పుకుంటున్నారని ఆ వృద్ధురాలు కన్నీటి పర్యంతమైంది. తాను చాలా పేదరాలని, భర్త చనిపోవడంతో కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నా పింఛను రావడానికి అధికారులు సహకరించడంలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయమై సచివాలయ ఉద్యోగి వివరణ కోరగా, జాబితాలో ఆమె పేరు ఉన్నదని, ప్రభుత్వం నుండి డబ్బులు రావడంలేదని, తమ పంచాయతీలో 75 మందికి కొత్తగా పింఛను రావాల్సి ఉందని తెలిపారు.

ఏసీసీ పరిశ్రమ భూ బాధితులకు న్యాయం చేస్తాం

మైలవరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఏసీసీ పరిశ్రమ భూ బాధితులకు న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుక్రవారం తెలిపారు. జమ్మలమడుగులోని నానుబాల ఫంక్షన్ హాలులో జరిగిన సమావేశంలో జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ఏసీసీ పరిశ్రమ భూ బాధితులకు న్యాయం చేయాలని సీఎం దృష్టికి తేవడంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ మైలవరం మండలంలోని వద్దిరాల, గొల్లపల్లె, ఉప్పలపాడు, చిన్నవెంతుర్ల, బెస్తవేముల, జంగాలపల్లి, రేగడిపల్లె, కల్లుట్లలోని రైతుల నుంచి 1996 సంవత్సరం నుంచి ఏసీసీ పరిశ్రమ పలు దఫాలు పరిశ్రమ నిర్మిస్తామని భూములు కొనుగోలు చేసిందన్నారు. అప్పటి నుంచి పరిశ్రమ నిర్మించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఏసీసీ పరిశ్రమ భూ బాధితులకు నష్టపరిహారం చెల్లించి పరిశ్రమ నిర్మించేందుకు కృషి చేస్తానని సీఎం చంద్రబాబు తెలిపారు. పరిశ్రమ నిర్మిస్తే వేల మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయని చుట్టుపక్కల గ్రామ ప్రజలకు ఉపాధి దొరుకుతుందని తప్పకుండా ఏసీసీ పరిశ్రమకు భూములిచ్చిన రైతులకు న్యాయం చేస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు.

చంద్రబాబు సభకు దివ్యాంగులు సైతం



ప్రజావేదిక ప్రాంగణానికి వస్తున్న దివ్యాంగులు

ముద్దనూరు ఆగస్టు1(ఆంధ్రజ్యోతి):జమ్మలమడుగు మండల గూడెం చెరువు గ్రామంలో శుక్రవారం జరిగిన ప్రజావేదిక విజయంతమయ్యింది.ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారు.అలాగే దివ్యాంగులు సైతం చంద్రబాబు సభకు తరలివచ్చారు.దీంతో ప్రజా వేదిక జనసంద్రమయ్యింది.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగుల కొడతాం

బద్వేలు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగిస్తే వాటిని పగులకొట్టే ఉద్యమం చేపడతామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరశేఖర్ హెచ్చరించారు. పట్టణంలోని జేవీ భవన్‌లో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా కరపత్రాలను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగించడం అంటే ప్రజల ప్రాథమిక హక్కులు కాలరాయడమేనన్నారు. స్మార్ట్ మీటర్లు రద్దును కోరుతూ ఆగస్టు 5వ తేదీన ఏడీ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ బద్వేలు పట్టణ కార్యదర్శి బాలు కార్యవర్గ సభ్యులు పీవీ రమణ, ఇమ్మానుయేల్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణకు యత్నం

అట్లూరు, ఆగష్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లాయపల్లె నల్లాయకుంట చెరువు మదాపూర్‌లో భూ ఆక్రమణలకు పాల్పడడంతో వలసపాలెం గ్రామస్థులు అడ్డుకుని రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆర్ఐ రమణ వీఆర్వో సందీప్ ఎక్స్‌కవేటరు డ్రైవరును అదుపులోకి తీసుకున్నట్లు తహసీల్దారు సుబ్బలక్ష్మి తెలిపారు. సంబంధిత ఆక్రమణదారులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని తహసీల్దారు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

బద్వేలు రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని సబ్ యూనిట్ అధికారి నరసింహా రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బయనపల్లె గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం డ్రైడే ఫ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా బయట తిండి పదార్థాలు తగ్గించడం, మురికికాల్వల వల్ల అనారోగ్యం, కూల్‌డ్రింక్ వదిలేసి టెంకాయనీళ్లు, మజ్జి. తీసుకోవడం, కాచి వడగట్టిన నీరువాడడంలాంటి వాటిపై అవగాహన కల్పించారు. జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకోవాలని వివరించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంటు జనార్ధన్‌రావు, ఏఎన్ఎంలు అఖిలభాను, గంగాదేవి, హెడ్మాస్టరు రేచల్‌రాణి, ఆశా, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే వరద

ప్రొద్దుటూరు ,ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : జమ్మలమడుగు నియోజకవర్గం గండికోట పర్యటనలో భాగంగా జిల్లాకు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కడప ఎయిర్‌పోర్టులో ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరద రాజులరెడ్డి స్వాగతం పలికారు. శుక్రవారం ఎయిర్‌పోర్టులో సీఎం చంద్రబాబుకు కలిసి పుష్ప గుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఓపెన్ హార్ట్ సర్జరీ అయిన వరదరాజులరెడ్డి ఆరోగ్యం పై సీఎం చంద్రబాబు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సీఎంను కలిసిన వారిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి సీ.ఎం.సురేష్‌నాయుడు, వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు ఉన్నారు.

బద్వేలు ఇన్‌చార్జి రితేష్‌కుమార్‌రెడ్డి ..

బద్వేలుటౌన్, ఆగస్ట్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుక్రవారం గండికోటకు విచ్చేసిన సందర్భంగా ఆయనను బద్వేలు నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌కుమార్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం నియోజకవర్గ సమస్యలను ఆయన సీఎంకు వివరించారు.

మంత్రి దుర్గేష్ ను కలిసిన బలిజసంఘం నేతలు

ప్రొద్దుటూరు. ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) :సీఎం చంద్రబాబునాయుడుతో కలిసి జమ్మలమడుగు పర్యటనలో భాగంగా గండికోటలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వచ్చిన రాష్ట్ర పర్యాటక శాఖమంత్రి కందుల దుర్గేష్‌ను పట్టణ బలిజసంఘం నేతలు కలిశారు. శుక్ర వారం స్థానిక కొవ్వూరు గ్రాండ్‌లో మంత్రి దుర్గేష్ ను కలిసి ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో పట్టణ బలిజ సంఘం నేతలు మంచి రాజా, జయశంకర్ , గుమ్మటమయ్య, ఘంటశాల వెంకటేశ్వర్లు, తుపాకుల చంద్రమౌళి, తాళ్లమాపుం శివ రిటైర్డ్ ఎస్ఐ శంకర్, చంద్రశేఖర్ విశ్వనాధ్, తోట విజయ్ తోట చంద్రశేఖర్, చిరంజీవి, మెడికల్ సురేష్ రామకృష్ణలు పాల్గొన్నారు. కాగా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను ప్రొద్దుటూరు జనసేన నాయకులు జిలాన్, అక్కిదాసరి రామారావులు కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువతో సన్మానించారు.

యథావిధిగా చిన్నేపల్లె స్కూలు 3, 4, 5 తరగతులు

అట్లూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) :అట్లూరు మండలంలోని చిన్నేపల్లె స్కూలు వద్దనే 3, 4,5 తరగతులు నిర్వహించాలని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. దీంతో శుక్రవారం సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేశ్, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, డీసీసీబీ ఛైర్మన్ మంచూరి సూర్యనారాయణరెడ్డి, బద్వేలు నియోజకవర్గం సమన్వయకర్త రితీష్‌రెడ్డి, పాలకొండ రాజశేఖర్‌రెడ్డిల పోస్టర్లకు క్షీరాభిషేకం చేసి అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. 26 మంది విద్యార్థులతో 1 నుంచి 5 తరగతుల వరకు ఉన్న ఈ స్కూల్ జూన్ మాసంలోప్రభుత్వం నిబంధనల మేరకు 3, 4,5 తరగతులు ఎస్.వెంకటాపురం మోడల్ స్కూలుకు స్థానిక ఎంఈవో విలియంరాజు బదలాయించారు. దీంతో విద్యార్థులను వారి తల్లిదండ్రులు స్కూలుకు పంపలేదు. స్కూలు కమిటీఛైర్మన్ శాంతకుమారి కమిటీ పెద్దలు, జిల్లాకలెక్టర్, డీఈవోకు ఫిర్యాదులు చేసి పోరాటం చేశారు. దీంతో ఉన్నతాధికారులు స్పందించి చిన్నేపల్లె స్కూల్‌లోనే 3, 4, 5 తరగతులను కొనసాగించేలా ఉత్తర్వులు ఇవ్వడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు.

విద్యార్థుల డిష్యూం... డిష్యూం



బద్వేలుటౌన్, ఆగస్ట్ 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలకు చెందిన విద్యార్థులు శుక్రవారం రెడ్డెయ్యమఠం వీధిలో ఒకరిపై ఒకరు బాహాబావిగా తన్నుకున్నారు. ఒకరిపై ఒకరు పిడిగుద్దులతో దాడిచేసుకుంటుండగా స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, పోలీసులు వెంటనే స్పందించి అక్కడికి చేరుకోవడంతో విద్యార్థులు అక్కడి నుంచి పరారయ్యారు. పోలీసులు కళాశాల వద్దకు చేరుకొని కళాశాల యాజమాన్యంతో మాట్లాడి విద్యార్థులను చదుకోమని కాలేజీకి పంపిస్తే రోడ్డుపై ఒకరిపై ఒకరు దాడిచేసుకోవడం పద్ధతి కాదని, హెచ్చరించారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పురస్కారం



బహుమతి అందుకున్న విద్యార్థులు

కాశినాయన ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): నర్సాపురం జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి సహకారంతో 2024-25లో పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన 5 మంది విద్యార్థులకు శుక్రవారం లక్ష రూపాయల నగదు పురస్కారం అందజేసినట్లు పాఠశాల ప్రదానోపాధ్యాయుడు నాగేశ్వరరావు తెలిపారు. పూర్వ విద్యార్థి అంభవరం చెన్నారెడ్డి తాను చదువుకున్న పాఠశాలకు తనవంతు సహకారం అందించాలనే దృడసంకల్పంతో శుక్రవారం ఎంఈవోలు మహమ్మద్ షఫీ, నిర్మల చేతుల మీదుగా మొదటి బహుమతి స్నేహంజలికి రూ.30 వేలు, రెండవ బహుమతి ఎస్.స్వాతి రూ.25 వేలు, 3వ బహుమతి ఎం.శ్రావన్‌కుమార్‌కు రూ.20 వేలు, 4వ బహుమతి ఏ.మేఘనకు రూ.15 వేలు, 5వ బహుమతి టి.జగన్‌కు రూ.10 వేలు అందజేశారు. అనంతరం దాతను ఉపాధ్యాయులు సత్కరించారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

బ్రహ్మంగారిమఠం, ఆగష్టు 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బాలబాలికలకు 496 మందికి 1960నోటు పుస్తకాలను పోరుమామిళ్ల మండలంలోని చిత్తశౌరిరెడ్డి మోమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ సహకరంతో సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత థామస్‌రెడ్డి చిత్తా దంపతుల ఆధ్వర్యంలో వారి ప్రతినిధి ఎల్.ప్రసాద్‌రెడ్డి వాటిని అందించారు.

అభివృద్ధే లక్ష్యంగా చంద్రబాబు పనిచేస్తున్నారు

●అర్హులందరికి పింఛన్లు పంపిణీ ● జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత



వితంతు పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి సవిత, ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్

మైదుకూరు రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తూ ముందుకు సాగుతున్నారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత పేర్కొన్నారు. స్థానిక 14వ వార్డులోని మూలబాటలో శుక్రవారం కొత్తగా మంజూరైన పింఛన్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైదుకూరు నియోజకవర్గంలో నేడు సుమారు 36 వేల మందికి పింఛన్లును, దాదాపు 15 కోట్ల 4 లక్షల రూపాయలను డబ్బులను పంపిణీ చేస్తున్నామన్నారు.ఈ నెల 15వ తేదిన మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ప్రారంభిస్తున్నామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకొన్నారు. ఇప్పుడిప్పుడే రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు ఒక గాడిలో పెడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, పార్టీ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు ధనపాల జగన్, మున్సిపల్ ఛైర్మన్ మాచనూరు చంద్ర, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఏపీ రవీంద్ర, పట్టణ టీడీపీ ఉపా ధ్యక్షుడు యాపరాల లక్ష్మీనారాయణ, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ యాపరాల చిన్న, తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు బురుగోళ్ల చిన్న, ధనపాల రవి, యుగంధర్, పాలమాబు, పందిటి పెద్దయ్య, చిగురుపాటి సుబ్బరాయుడు, కటారి కృష్ణ, తుపాకుల రమణ పాల్గొన్నారు.

టీడీపీలో అంతర్గత కలహాలు బహిర్గతం : స్థానిక మూలబాటలో పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే సమక్షంలోనే ఇటీవల వైసీపీకి రాజీనామా చేసిన మున్సిపల్ ఛైర్మన్ మాచనూరు చంద్రను టీడీపీ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు ధనపాల జగన్ మా ఎమ్మెల్యే కార్యక్రమానికి రావద్దు అంటూ తోశాడు. దీంతో కొద్దిసేపు ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. ఎమ్మెల్యే ఇరువురికి సర్దిచెప్పి పంపించారు.

పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం



పెన్షన్లను పంపిణీ చేస్తున్న విజయమ్మ, రితేష్, మంచూరు

బద్వేలు, జూలై1 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమ ని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పేర్కొ న్నారు. బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని 32వ వార్డులో ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం డీసీసీ బ్యాంక్ ఛైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి, బద్వేలు నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌రెడ్డిలతో కలిసి మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పెన్షన్లు పంపిణీ చేశారు. లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేస్తూ గడప గడపగపడకు వెళ్లి ఆత్మీయంగా పలకించారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న పలు రకాల పెన్షన్లు వాటి అమలుపై లబ్ధి దారులకు అవగాహన కల్పించారు.

పింఛన్ల పంపిణీలో టీడీపీ నేతలు

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండలంలోని మల్లేపల్లె పంచాయతీలోని చెంచయ్యగారిపల్లె గ్రామంలో మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నేతలు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఇందులో మాజీ విద్యాకమిటీ ఛైర్మన్ చిలమల నాగయ్య, రేకలకుంట పంచాయతీ డి.అగ్రహారం మండల టీడీపీ యువనాయకులు కాణాల మల్లిఖార్జునరెడ్డి, పుట్టాల శివ, గుజ్జు రామాంజనే యులు లబ్ధిదారులకు పింఛను డబ్బులు అందజేశారు.ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దువ్వూరులో అదనంగా 125 పింఛన్లు పంపిణీ

దువ్వూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలానికి ఆగస్టు నెల నుంచి అదనంగా మంజూరైన 125 పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీవో రామకృష్ణయ్య తెలిపారు. మండల వ్యాప్తంగా 7,237 పింఛన్లకుగాను శుక్రవారం 6,887 పింఛన్ల పంపిణీ జరిగినట్లు పేర్కొన్నారు.

రాజుపాళెం మండలానికి 79 పింఛన్లు మంజూరు

రాజుపాలెం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) :రాజుపాలెం మండలానికి కొత్తగా 79 పింఛన్లు మంజూరైనట్లు ఈవోపీఆర్‌డీ షాకీర్‌ఆలీఖాన్ తెలిపారు. గతంలో వృద్ధాప్య, దివ్యాంగులు, వితంతువులు కలిపి 4588 ఉన్నట్లు తెలిపారు. ప్రతినెలా 1న గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో పింఛన్లుపంపిణీ చేయడం జరుగుతుందన్నారు. గతంలో భర్తకు వస్తున్న పింఛను అతను మరిణించిన స్థానంలో వారి భార్యకు ఈ కొత్త పింఛన్లు మంజూరు కావడంతో ఆయా గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ప్రజాప్రతినిధులతో కలిసి పంపిణీ చేసినట్లు తెలిపారు.

కానిస్టేబుల్ ఫలితాల్లో సృజన్ విద్యార్థుల సంచలనం



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఏపీ కానిస్టేబుల్స్ పరీక్షా ఫలితాల్లో సృజన్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు ఎంపికయ్యారని డైరెక్టర్లు కె.సునీల్, కె.సృజన్‌లు తెలిపారు. టి.చిన్ననాగమ్మ, కె.రాజేశ్వరి, యు.వసుంధర, జె.నాగశిరీష, ఎం.కృష్ణవేణి, బి.సురేఖ, నాగజ్యోతి, బి.సాయివైష్ణవి, ఎల్.స్వీటీ, ఎ.అరుణ, వి.సుప్రియ, వి.మనోహర్, కేఎం.బాష, ఎం.చంద్రశేఖర్, వై.సురేష్, జి.దస్తగిరి, ఎన్.సునీల్, వై.రామచంద్రుడు, ఎ.సురేష్, ఎ.రామాంజనేయులు, సాయినాయక్, 21 మంది ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను డైరెక్టర్లు, అధ్యాపకులు ధనుంజయరెడ్డి, సురేష్, కిశోర్, తదితరులు అభినందించారు.

పూర్ణా విద్యార్థుల విజయకేతనం



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ పరీక్షా ఫలితాల్లో పూర్ణాకోచింగ్ సెంటర్ విద్యార్థులు విజయబేరీ మోగించారని డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. జి.లక్ష్మీప్రసన్న (సివిల్), సి.ఓబులేసు (సివిల్), జి.దస్తగిరి (ఏపీఎస్పీ) ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను కోచింగ్ సెంటర్ డైరెక్టర్ వి.చంద్రశేఖర్‌రెడ్డి, ఏవో మహేశ్వరరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

ముర్రుపాలు బిడ్డకు శ్రేయస్కరం

ఖాజీపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి):తల్లి ముర్రుపాలు బిడ్డకు శ్రేయస్కరమని అంగన్వాడీ సూపర్‌వైజర్ భారతి అన్నారు. ఖాజీపేట మూడవ సెంటర్‌లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించి గర్భవతులు, బాలింతలకు అవగాహన కల్పించారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాపితే ఎంతో శ్రేయస్కరమన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాజుపాలెంలో : ప్రపంచ తల్లిపాల వారోత్సవాల దినం సందర్భంగా మండల కేంద్రమైన రాజుపాలెం-2 అంగన్వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజరు విజయశ్రీ ఆధ్వర్యంలో వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ నెల 7 వరకు అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తామని సీడీపీవో తెలిపారు.

ఉపాధ్యాయురాలికి ఘన సన్మానం

పోరుమామిళ్ల, ఆగష్టు 1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో పోరుమామిళ్ల మెయిన్‌స్కూలు నుంచి కడపకు బదిలీ అయిన కళావతిని మోడల్ ప్రైమరీ స్కూలు ఉపాధ్యాయులు చీర, సారెలతో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలతోపాటు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సీపీఐ నేత హౌస్ అరెస్టు

కొండాపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జమ్మలమడుగు పర్యటన నేపథ్యంలో మండల సీపీఐ కార్యదర్శి మనోహర్‌బాబు ను పోలీసులు శుక్రవారం హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరన్నారు. వెంటనే గండికోట ముంపువాసుల కు పరిహారం విడుదల చేయాలని లేఖలో సీఎంను కోరినట్లు ఆయన తెలిపారు